## నేడు కొండపై కార్తీకపర్వ దీపోత్సవం



తిరుమల, డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి: కొండపై గోవిందుని ఆలయంలో నేటి సాయంత్రం సాలకట్ల కార్తీక పర్వదీపోత్సవం చేపడుతున్నారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా సాయంకాలం కైంకర్యాలు ,నివేదనలు పూర్తయిన తరువాత ఈ దీపోత్సవం వెలిగిస్తారు. సాయంత్రం ఆలయంలోపల నేతి ఒత్తులతో దీపాలు వెలిగించి ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమానప్రదక్షణచేస్తూ ఆనందనిలయంలో శ్రీవారికి హారతి ఇస్తారు. ఆ తరువాత వరుసగా గర్భాలయంలో అఖండం నుండి మహద్వారం వరకు ఆలయంలోపల దీపాలు వెలిగిస్తారు. ఆలయం వెలుపల దీపాలను వెలిగించి కార్తీక దీపోత్సవం జరిపిస్తారు. నేడు పౌర్ణమి గరుడసేవ రద్దయ్యింది.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఆరనీకుమా... కార్తీకదీపం

### కపిలతీర్థంలో కృత్తికాదీపోత్సవం

తిరుపతి కపిలతీర్థంలో బుధవారం సాయంత్రం కృత్తికాదీపోత్సవం వేడుకగా చేపట్టారు. త్రిశూలం, శివలింగం ఆకారంలో దీపాలు వెలిగించి హరహరమహాదేవ శంభోశంకర నామస్మరణ చేశారు.



ప్రభాతవార్త-తిరుపతి

# మంచెత్తిన వాన

## కాళంగి ఉగ్రరూపం

### - నీట మునిగిన పంట పొలాలు



పొంగి ప్రవహిస్తున్న కాళంగి నది, నీట మునిగిన పంట పొలాలు

సూళ్లూరుపేట, డిసెంబర్ 3 ప్రభాతవార్త

దిత్వా తుపాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కాళంగి నది పరవళ్లు తొక్కుతూ ఉగ్రరూపం దాల్చింది. బుధవారం కాళంగి నదికి వరద నీరు ఎక్కువగా రావడంతో లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తమయ్యారు. దీనికితోడు పాముల కాలువ పొంగి ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలన్నీ నీట మునిగాయి. భారీ వర్షాలతో గ్రామీణ రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. మంగళంపాడు మీదుగా పడమటి పల్లెలకు వెళ్లే రోడ్డు వద్ద దొండ కాలువ పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. మండల పరిధిలోని తూర్పుపల్లెలకు వెళ్లే తీరప్రాంత గ్రామాలైన కొరిడి, పేర్నాడు, దామరాయ, కడపత్ర పంచాయతీల పరిధిలో రోడ్లన్నీ రొచ్చుగుంటలుగా మారడంతో ప్రజలు ఆ గ్రామాల నుంచి సూళ్లూరుపేటకు వచ్చేందుకు అవస్థలు పడుతున్నారు. ఇదిలావుంటే సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో బుధవారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పట్టణంలోని ఆర్అండ్‌బి రోడ్డుపై మోకాటిలోతు నీళ్లు నిలిచిపోయాయి. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థకు తోడు రోడ్డుపై ఆక్రమణలు ఎక్కువ కావడంతో వర్షపు నీరు వెలుపలికి వెళ్లే వీల్లేకపోవడంతో రోడ్లపై నిలిచిపోయి ప్రజలకు ఇబ్బందులకు గురిచేశాయి.

## పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు



దొరవారిసత్రం, డిసెంబర్ 3, ప్రభాతవార్త

దొరవారిసత్రం మండల పరిధిలోని గత వారం రోజులకు కురుస్తున్న వర్షాల కారణంగా వేణుంబాకు చెరువు కుంగడంతో యుద్ధ ప్రాతిపదికన అధికారులు స్పందించి ట్రాక్టర్లో జెసిబిలు సాయంతో చెరువుకు మరమ్మత్తులు చేయడం ద్వారా పెను ప్రమాదం తప్పిందని మండల తాసిల్దార్ శైలు కుమారి తెలిపారు. దిత్వా తుఫాన్ కారణంగా పూలతోట కన్నాకాలువ తనియాలి కాలంగి నది మరియు ఎదురుపట్టు దగ్గర ఉన్న పాలకాలవ ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది కంపెనీకి పోవాల్సిన బస్సులు ఎక్కడెక్కడ ఆగిపోవడంతో ఎంప్లాయిస్ ఇంటికి పరిమితమయ్యారు. మండలంలోని అధికంగా కురుస్తున్న వర్షాల కారణంగా వెదురుపట్టు తనియాలి అక్కర పాక మిజూరు తదితరు గ్రామాల్లో పంట పొలాల నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఎస్టీలకు జీవనాధారంగా ఉన్న చేపల వేట పోలీసులు ఆంక్షలు విధించడంతో జీవన ఉపాధి కోల్పోయామని ప్రభుత్వం ఆదుకొని ఉచిత బియ్యం ఇప్పించాలని కొందరు కోరుకుంటున్నారు.

## జలమయమైన శ్రీకాళహస్తి

### అధికారుల పరుగులు: మున్సిపల్ అధికారుల తిప్పలు



స్వర్ణముఖినదిలో ప్రవహిస్తున్న నీరు, పెండ్లి మండపం వద్ద రోడ్లమీద ప్రవహిస్తున్న నీరు, జయరామారావువీధిలో రాక పోకలకు అంతరాయంగా మారిన దృశ్యం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 3 ప్రభాతవార్త

తిరుపతిజిల్లా తూర్పు మండలాలను తుఫాను వానలు కురుస్తున్నాయి. ఎటు చూసినా నీళ్ళు అన్నట్లు జలమయమైంది. ప్రభుత్వ కార్యాలయాలు ముఖ్యంగా ఏరియా ఆసుపత్రి, అర్బన్, తొట్టంబేడు పోలీసుస్టేషన్లు ఆర్ అండ్‌బి అతిధి గృహం, జూనియర్ కళాశాల ప్రాంతాలతో పాటు తుడా కార్యాలయం, విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఇక లోతట్టు ప్రాంతాలైన ఎంఎంవాడ, సంతమైదానం చెంచులక్ష్మీకాలనీలో కొంత భాగం లో నీరు ప్రవేశించి గందరగోళంగా మారింది. కెవిబిపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్‌లో నీరు చేరుతుంది. దాంతో బుచ్చినాయుడు కండ్రిగలోని పలు చెరువులు తెలుగుగంగ నీటితో నింపారు. ఐదు రోజుల నుంచి తద్వా తుఫాను ప్రభావంతో సామాన్యుడి బతుకు బండి మూలన పడింది. తుఫాను మహాబలి పురం వద్ద తీరం దాటిందన్న సమాచారంతో సామాన్యులు హమ్మ య్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే బుధవారం ఉదయం నుంచి ఎడతెరపి లేని వర్షంతో జనజీవనం స్థంభించింది.

**ఒకటే ధార . . .**

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అప్పపీడనం తుఫానుగా మారిన సమయంలో బుధవారం వేకువ జాము నుంచి ఈ ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురిసింది. అర్ధరాత్రి దాటిన తరువాత వర్షం మొదలైంది. అప్పటి నుంచి ఽకుండపోతగా వర్షంతో వీధులు జలమయమయ్యాయి. జన జీవనం స్థంభించింది. రోడ్ల మీద, పంటపొలాల్లో నీరు నిలిచి సముద్రంలా మారింది. ఎటుచూసినా వర్షపు నీరుతో మునక ప్రాంతాలుగా మారింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏక ధారగా వర్షం కురిసింది. శివారు ప్రాంతాల్లోని ఎస్‌డికె నగర్‌లో వాతావారణం భిన్నంగా కనబడింది. మధ్య మధ్యలో ఇళ్ళు చుట్టూ నీళ్ళుతో ఈ కాలనీలోని ఇళ్ళు ద్వీపాల్లా మారింది. చుట్టూ నీళ్ళతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని ఆగమ్యగోచర పరిస్థితి చోటు చేసుకుంది.

**మున్సిపల్ అధికారుల తిప్పలు**

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పురాతన కాలం నాటి కాలువలు నేటి అవసరాల్ని తీర్చలేకపోతున్నాయి. ముఖ్యంగా జయరామారావువీధి, సంతమైదానంలో పరిస్థితి దయనీయంగా మారింది. అంతేకాక కాలువలను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టడంతో భారీ వర్షాలతో పరిస్థితి ఆగమ్మగోచంగా మారింది. మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, శానిటరీ ఇన్సెపెక్టర్ మోతీలాల్ ఎడతెరపి లేని వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా సిబ్బందిచే పనులు చేయించారు. ఇక అన్ని సచివాలయాలు పని చేశాయి. శివయ్య చెంత ఉన్న పరమపవిత్ర స్వర్ణముఖినదిలో నీటి ప్రవాహం పెరిగింది. బుధవారం ఉదయం నుంచి ఎడతెరపిలేకుండా తెరపలు తెరపలుగా కుండపోతగా వర్షం కురుస్తున్నందువల్ల నదిలో ప్రవాహం ఎక్కువైంది. అంతేకాకుండా గంగమ్మకు పలువురు మహిళలు స్థానిక ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న గేట్ల వద్దకు చేరుకుని స్వర్ణమ్మ ప్రవహాన్ని చూసి ఆనందిస్తున్నారు. మరికొందరు మహిళలు స్వర్ణమ్మకు హారతులిచ్చి పసుపుకుంకుమ సమర్పిస్తున్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి

నాయుడుపేట రూరల్, డిసెంబర్ 3 ప్రభాతవార్త

దిత్వా తుపాను ప్రభావంతో నాయుడుపేట ప్రాంతంలో గత నాలుగురోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఇప్పటికే జలకళ సంతరించుకున్న స్వర్ణముఖి నది, మామిడి కాలువలకు వరద భారీగా చేరింది. ఎగువ ప్రాంతాల్లో సైతం భారీ వర్షాలు కురుస్తుండటంతో ఈ వరద ఎక్కువైంది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇదిలావుంటే మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. పొలాల్లోకి వరద నీరు ప్రవహిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్తాల్లో ఇసుక నింపి పొలాలకు నీరు పారకుండా అడ్డు వేస్తూ కనిపించారు.



### కన్నుల పండువగా

## జ్వాలాతోరణం

### శివయ్యకు అగ్నితో అభిషేకం
### కన్నుల పండువగా జ్వాలా తోరణం





శ్రీకాళహస్తి, డిసెంబర్ 3 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారంరాత్రి భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా జ్వాలా తోరణం కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిఏడాది ఆలయంలో చొక్కాణి ఉత్సవాన్ని నిర్వహించటం ఆనవాయితి. ఈ ఏడాది చొక్కాణి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొన్ని తమిళ సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తిరుణ్ణావమలైలో పౌర్ణమి సందర్భంగా అగ్నితో అభిషేకించటం ఆనవాయితి. ఈ ఆనవాయితి శ్రీకాళహస్తీశ్వరాలయంలో కూడా తరాలనుంచి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ సారధ్యంలో నిర్వహించారు.

బాలదీపాల ఊరేగింపు:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో చొక్కాణి సందర్భంగా ఆలయంలోని అమ్మవారి గర్భగుడి వద్ద మంగళవారం రాత్రి వెలిగించిన బాల దీపాలను అర్చకులు నాట్యాలుచేస్తూ నంది విగ్రహం వద్దకు తెచ్చారు. సంప్రదాయబబద్దంగా వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా అర్చకులు, ఆలయ పౌరోహితుల సారధ్యంలో చొక్కాణి చెట్టును తగులుబెట్టారు. శివయ్యను అగ్నితో పూజించే విధానాల్లో ఇదొకటి. అయితే చొక్కాణి ఉత్సవానికి స్థానిక భక్తులు విశేషసంఖ్యలో హాజరయ్యారు. తాటిచెట్టుకు తాటిమట్టలు కట్టి చివరన దీపం ఏర్పాటు చేసి తగుల బెట్టడం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఓ పరిచారకుడు దీపాన్ని చెట్టుపై ప్రతిష్టించారు. తరువాత తాటి మట్టలను కాల్చారు. ఆయన దీపారాధనలో పాల్గొనటంతో సాయంత్రం 7గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమాలు 8గంటల తరువాత ప్రారంభించారు.

## తిరుపతిరూరల్ ఎంపిడిఓ కుర్చీ ఖాళీ !

### మేజర్ మండలానికి ఎంపిడిఓను ఎందుకు నియమించడం లేదు?
### ఇన్‌చార్జి ఎంపిడిఓతోనే పాలన కొనసాగిస్తారా!
### తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్న

తిరుపతిరూరల్, డిసెంబర్ 3 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) పదవి సెప్టెంబర్ 9వ తేది నుండి ఖాళీగా ఉండటం వల్ల పరిపాలన తీవ్రంగా దెబ్బతింటోందని తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలో జిల్లా పునర్విభజన అనంతరం కొత్త జిల్లాలో అత్యధిక జనాభా ఉన్న మండలం తిరుపతిరూరల్. పనిభారం విపరీతంగా పెరిగినా, కీలక హోదా మాత్రం దీర్ఘకాలంగా భర్తీ కాకపోవడం మండలస్థాయి అభివృద్ధిపై ప్రభావం చూపుతుందన్నారు. తిరుపతిరూరల్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు, 37 గ్రామ సచివాలయాలు, 1.60లక్షల మంది ఓటర్లు ఉన్నారని, వీరందరికి జేష్టభాగమైన అధికారి ఎంపిడిఓ కుర్చి ఖాళీగా ఉండటంతో అభివృద్ధి మందగమనం పట్టిందని ఎంపిపి వాపోయారు. మేజర్ మండలమైన తిరుపతి రూరల్ మండలంలో స్టీరింగ్ లాంటి ఎంపిడిఓ లేకపోవడంతో తిరుపతిరూరల్ రెగ్యులర్ ఎంపిడిఓ లేనందున గ్రామీణ అభివృద్ధి పథకాల పర్యవేక్షణ మందగించడం, గ్రామ సచివాలయ పనితీరు రివ్యూలు నిలిచిపోవడం, పంచాయతీల సమస్యలు పరిష్కారం కాకపోవడం జరుగుతుందన్నారు.



ఇంకేన్నాళ్ళు ఇన్‌చార్జి పాలన

మూడు నెలలు పూర్తి కావస్తున్నా ఎంపిడిఓను నియమించక, ఇన్‌చార్జి ఎంపిడిఓతోనే పాలన కొనసాగించం బాధాకరమని ఎంపిపి అన్నారు. తిరుపతి నగరానికి అనుకుని ఉన్న తిరుపతి రూరల్ మండలం ఉండటంతో అధికారుల, ప్రజాప్రతినిధుల, ప్రముఖుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రోటోకాల్ చూడాల్సి బాధ్యత కూడా మండల అధికారులపై ఉంటుందన్నారు. డిప్యూటీ ఎంపిడిఓలు ప్రోటోకాల్‌లలో బిజీగా ఉంటే పాలనపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ఎంపిడిఓను నియమించాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

సెలవులో సీనియర్ అసిస్టెంట్

అదేవిధంగాఎంపిడిఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సెలవు పెట్టడంతో ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. సీనియర్ అసిస్టెంట్ లేనందున జరిగిన అభివృద్ధి పనులు, జరగాల్సిన అభివృద్ధి పనులకు రికార్డ్స్ మెయింటెన్స్, జీతభత్యాలు చెల్లింపులు, జమఖర్చులు అన్ని కూడా సీనియర్ అసిస్టెంట్‌చే జరగాల్సి ఉంది.

## కేరళలో రోడ్డు ప్రమాదం

### బుచ్చినాయుడుకండ్రిగ మండలవాసులు తండ్రీకొడుకు మృతి



మృతులు గిరిజాల నరేష్, వేణు (ఫైల్)

బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 3 ప్రభాతవార్త: అయ్యప్ప స్వామి దీక్ష తీసుకుని శబరిమలైలో అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కారణి గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు కారు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... కారణి గ్రామానికి చెందిన గురిజాల వేణు(49) కుమారుడు గురజాల నరేష్(30), చాతుర్య(9) వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురం గ్రామానికి చెందిన మునితేజ అయ్యప్ప దీక్ష మాల వేసుకుని స్వామి దర్శనం కోసం కారులో బయలుదేరి శబరిమలై చేరుకుని అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని మంగళవారం తిరుగు ప్రయాణం అయ్యారు. మార్గ మధ్యలో కేరళ రాష్ట్రంలోని తేనె టౌన్ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొనడంతో పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. సంఘటనలో కారు డ్రైవింగ్ చేస్తున్న నరేష్, పక్కనే ఉన్న వేణుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వీరితో పాటు ప్రయాణిస్తున్న మునితేజకు రెండు కాళ్లు విరిగిపోగా, చాతుర్య ఎగిరి కాలువలోని పొదలలో పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. తేనె టౌన్ లోని ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, గురువారం కారుని గ్రామానికి మృతదేహాలు వస్తాయని కుటుంబ సభ్యులు తెలిపారు. వేణు బేల్దార్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నరేష్ కారు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబ పోషణ చేసుకుంటారు. నరేష్‌కు ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన తండ్రి కుమారుడు చనిపోవడంతో ఆ కుటుంబం దికిచవలసిన పరిస్థితిలో ఉంది. వీరి మృతితో గ్రామస్తులు శోకసముద్రంలో అల్లాడుతున్నారు.

## నేడు చిత్తూరుకు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ రాక

చిత్తూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త: డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ గురువారం చిత్తూరులో పర్యటించనున్నారు. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ గురువారం ఉదయం 9.50 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుండి తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. డిప్యూటీ సిఎం ఉదయం 9.55 గంటలకు తిరుపతి నుండి చిత్తూరుకు బయలుదేరి చిత్తూరులోని డివిజనల్ లెవల్ అభివృద్ధి అధికారి కార్యాలయం వద్దకు చేరుకుంటారు. ఉదయం 11.30 నుండి 12.30 గంటల వరకు చిత్తూరులోని డివిజన్ అభివృద్ధి కార్యాలయంను డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు డిప్యూటీ సిఎం చిత్తూరు నుండి తిరుపతి బయలుదేరి వెళ్తారు. డిప్యూటీ సిఎం మధ్యాహ్నం 1.55 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి గన్నవరంకు విమానంలో బయలుదేరి

## డిప్యూటీ సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



చిత్తూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త:

రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ గురువారం జిల్లా కేంద్రం చిత్తూరులో పర్యటించనుండటంతో డిప్యూటీ సిఎం పర్యటించే ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ తుషార్ డూడి పరిశీలించారు. చిత్తూరులో గురువారం డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ డివిజనల్ లెవల్ అభివృద్ధి అధికారి కార్యాలయంను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులకు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పర్యటన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

**ఏర్పాట్లను పరిశీలించిన పిఆర్ కమీషనర్, కలెక్టర్**

చిత్తూరులో గురువారం డిప్యూటీ సిఎం పవణ్ కళ్యాణ్ పర్యటించనుండటంతో ముందస్తు పర్యటన ఏర్పాట్లను గురువారం పంచాయతీరాజ్ శాఖ కమీషనర్ కృష్ణతేజ, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు పరిశీలించారు. పవన్ కళ్యాణ్ డిఎంహెచ్ఓ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన డివిజనల్ లెవల్ అభివృద్ధి అధికారి కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. పంచాయతీరాజ్ శాఖ కమీషనర్ కృష్ణతేజ, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు పర్యటించి ముందస్తు ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు.

## గంగమ్మ ప్రతిమలు .. భక్తి ప్రపత్తులు

### వైభవంగా చంద్రగిరి జాతర వేడుకలు : పాల్గొన్న ఎంఎల్ఏ పులివర్తి నాని



చంద్రగిరి, డిసెంబర్ 3 ప్రభాతవార్త:

నాలుగు గంగమ్మల ప్రతిమలు మోసుకువస్తున్న మాతంగి వేషధారణులు (చాకలిలకు) జంతు బలులతో రక్తతర్పరణలు గావించి భక్తిప్రపత్తులో గ్రామంలోకి ఆహ్వానించారు. చారిత్రాత్మక చంద్రగిరిలో 4వ మంగళవారం - బుధవారం నడివీధి గంగమ్మ జాతర వేడుకలలో గతంలో ఎన్నడూలేని రీతిన వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి 10 గంటలకు బయలుదేరి స్వర్ణముఖీనదికి చేరుకుని సుమారు 10 అడుగులలోతు 20 అడుగుల వెడల్పుతో పూడికతీశారు. వేకువజామున శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ అర్చకులు సూరిస్వామి ఆధ్వర్యంలో ఇసుక రేనువులు, పసుపు మిశ్రమంతో నాలుగు గంగమ్మ అమ్మవారి ప్రతిమలను తయారుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ పులివర్తి నాని నాలుగు గంగమ్మల ప్రతిమలకు పూజలు చేసి, ఆశీస్సులం దుకున్నారు. మేళతాళాలు, మంగళవాయిధ్యాల నడుమ నదిలో నుండి బయలుదేరిన మాతంగిలు గ్రామపొలిమేరలకు చేరుకోవడంతో జంతువులను బలిచ్చేవారు ఒకవైపు, మహిళల మంగళహారతులతో కుంభాలు సమర్పిస్తూ మరోవైపు, పోటెత్తిన భక్తజన సందోహం పోటెత్తగా జాతర వేడుకలను మిన్నంటాయి. విశేష అలంకరణలతో గంగమ్మ వారు తరలివస్తుండగా భక్తులు అమ్మవారి దర్శన భాగ్యంతో పరవశించారు. నలుదిక్కులలోని గంగమ్మ స్థానాలకు మాతంగిలు చేరుకోగా జాతర వేడుకలు అంబరాన్నంటాయి. జాతర వేడుకలు నిర్వహిస్తున్న పినపెద్దలకు ఎంఎల్ఏ పులివర్తి నాని తనవంతు నగదు కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పినపెద్దలు పాకాల సతీష్‌కుమార్ రెడ్డి, విరూపాక్షి శంకర్ రెడ్డి, మొక్కల రాజారెడ్డి, శ్రీనివాసులు, శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గౌస్ భాషా, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, పట్టణ అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



**యర్రావారిపాలెం, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రొంపిచెర్ల ఎంపీపీఎస్ తెలుగు పాఠశాలలో గల భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించాలని కోరారు. తమ పని తాము చేసుకునేలా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కోరారు. దివ్యాంగుల కు విద్య పరంగా భవిత కేంద్రంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందించే అన్ని రకాల వసతులు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో ఇంకా ఎవరైనా దివ్యాంగులు ఉంటే వారికి కూడా భవిత కేంద్రంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంటి వద్ద ఉన్న వారికి కూడా గడపగడపకు వెళ్ళి అవసరమైన సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఇందిరా, శ్రీనివాసులు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర శేఖర్, బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రఫీ బాషా, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ప్రకాష్, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు రెడ్డి రమేష్, ఉపాధ్యాయ సహిత విద్యా కేంద్రం ఉపాధ్యాయులు ఎన్.అమ్ములు, మానస, ఎస్జీవో సుధాకర్ రెడ్డి, ఐఈడీఎస్ రెడ్డయ్య, ఫిజియోథెరపీ జె. హేమలత తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు దైవంతో సమానం



**బంగారుపాళ్యం, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** అంగవైకల్యంతో జన్మించిన దివ్యాంగులు దైవంతో సమానమని మండల టిడిపి ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడు అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను తగ్గువారిపల్లి భవిత కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జనార్ధన్‌గౌడు మాట్లాడుతూ అంగవైకల్యం అభివృద్ధికి అటంకం కాదని సాధన వుంటే ఎదైనా సాధించవచ్చునన్నారు. దివ్యాంగులకు సేవ చేయడం భగవంతుడికి సేవ చేయడంతో సమానమనే విషయాన్ని గుర్తించాలన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందని వివరించారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబోధనతో పాటు ఉచితంగా భోజన వసతి ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానంచేశారు.ఎంపిడిఓ మహేష్, ఎంఇఓలు నాగేశ్వరరావు, రమేష్‌లు, హైస్కూల్ హెడ్మాస్టర్ రాజేంద్ర,భవితకేంద్రఉపాధ్యాయులు హిమబిందు, వీరయ్య, సిఆర్‌పిలు సుశీల, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సేవా దృక్పథం పెరగాలి



**గుడిపాల, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో సేవాదృక్పథం పెరగాలని ఎఎన్ఆర్ కళాశాల కరెస్పాండెంట్ లోకేష్, సింగిల్‌విండో ఛైర్మన్ ప్రతాప్‌నాయుడులు పేర్కొన్నారు. మండలంలోని వసంతాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభోత్సవంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ అనేది 1969 సంవత్సరంలో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, విద్యార్థులు స్వచ్ఛంధంగా సమాజ సేవ చేయడానికి, వారిలో సామాజిక బాధ్యతను పెంపొందించడానికి ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థులకు సమాజ సమస్యలపై అవగాహన కల్పించడం, నిరుపేదల పట్ల సానుభూతి పెంచడం, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చేయడం, విద్యార్థుల్లో సామాజిక స్పృహ కల్పించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డప్ప, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అపోలోను సందర్శించిన యూకే ప్రొఫెసర్ల బృందం



**చిత్తూరుహెల్త్, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్(యూకే) ప్రతినిధి బృందం బుధవారం అపోలో యూనివర్సిటీని సందర్శించింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ ప్రతినిధి బృందంతో సమావేశమైన వైస్ ఛాన్సలర్ డాక్టర్ వినోద్‌భట్ మాట్లాడుతూ అంతర్జాతీయ విద్యా మార్పిడి, మెడికల్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత, గ్లోబల్ ఎడ్యుకేషన్‌లో లీసెస్టర్ యూనివర్సిటీ స్థానంను వివరించారు. భారతీయ విద్యార్థులకు లీసెస్టర్‌లో మరిన్ని అవకాశాలు కల్పించడానికి భాగస్వామ్యంను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. భారత విద్యార్థులను ఇండియా అంబాసిడర్లుగా చూడాలన్నారు. ప్రొఫెసర్ లీనా సోదా మాట్లాడుతూ లీసెస్టర్ యూనివర్సిటీలో సుమారు 2,500 మంది విదేశీ విద్యార్థులు చదువుతున్నారన్నారు. భారత్‌లో అపోలోతో పాటు పలు ప్రముఖ విద్యాసంస్థలతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవడం వల్ల పరిశోధన, అకడమిక్ మార్పిడి, గ్లోబల్ ఎక్స్‌పోజర్ మరింత పెరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు, డీన్స్ ప్రొఫెసర్ డి.జగదీశన్, ప్రొఫెసర్ కె.భాస్కరరెడ్డి, డాక్టర్ రామయ్య ఇటుమల్ల, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ వివేకానందన్, అంతర్జాతీయ వ్యవహారాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కీర్తన, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైకల్యం శరీరానికే..ప్రతిభకు కాదు..ఎల్ భాస్కర్

**గంగవరం, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**



వైకల్యం అనేది శరీరానికే గాని ప్రతిభకు కాదని పలమనేరు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎల్.భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పలమనేరు మండల న్యాయ సేవా అధికార సేవా సంస్థ అధ్యక్షులు సీనియర్ సివిల్ జడ్జి వావిలి ఆదినారాయణ ఆదేశాల మేరకు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దివ్యాంగుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.దివ్యాంగులకు నచ్చిన రంగాల్లో ప్రోత్సాహాన్నిస్తూ వారి ప్రతిభ పాటవాలను వెలికి తీయాలని,దీనికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు సైతం సహకరించాలని సూచించారు.దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను కల్పిస్తుందన్నారు.ప్రతి విద్యార్థి ఏనాడు తన అవిటితనాన్ని లెక్క చేయక ముందుకు సాగి విజయ శిఖరాలను చేరుకోవాలన్నారు.దివ్యాంగులు ప్రభుత్వం అందించే సదరం సర్టిఫికేట్లు తప్పనిసరిగా పొందాలని,సదరం సర్టిఫికేట్లు పొందే విధానంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాల్‌రెడ్డి,బార్ అసోషియేషన్ అధ్యక్షుడు షేక్ షరీఫ్,ప్రధానోపాధ్యాయులు చెంగల్‌రెడ్డి,ఇంచార్జ్ ఎంప్పీడివో ప్రసాద్,ఐఆర్టీలు సురేఖ,త్రిలోక్,కోర్టు సిబ్బంది,ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ విశ్వాసంతో దివ్యాంగులు అనేక రంగాల్లో ముందు ఉండాలి

**పుత్తూరు రూరల్, డిసెంబరు 3 ప్రభాతవార్త:**



ఆత్మ విశ్వాసంతో దివ్యాంగులు అనేక రంగాల్లో రాణించాలని అందరి స్ఫూర్తితో నిలవాలని పుత్తూరు సీనియర్ న్యాయవాది మురుగేష్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పుత్తూరు మదర్ థెరిసా బదిలీ పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఆదేశాలు మేరకు సమావేశం నిర్వహించారు. న్యాయవాది మురుగేష్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మ స్థైర్యంతో అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని, విభిన్న ప్రతిభావంతులు, ప్రతి ఒక్కరు వారి హక్కులను తెలుసుకోవాలని, ధైర్యంగా నిలబడాలని తెలిపారు. కార్యక్రమంలో మదర్‌థెరిసాపాఠశాల కరస్పాండెంట్ కఠారి శివయ్య, సుబ్రహ్మణ్యం, సెక్రటరీ సురేష్‌కుమార్ యాదవ్, మనోహర్, వరలక్ష్మి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పన్నూరులో రైతన్న మీ కోసం వర్క్‌షాపు

**విజయపురం, డిసెంబరు 3 ప్రభాతవార్త:**



మండలంలోని పన్నూరు, ఆలపాకం రైతు భరోసా కార్యాలయంలో ఏవో రజనీకుమారి రైతులకు బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సందేశాన్ని టీవీ ద్వారా వినిపించారు. రైతులు నూతన పద్ధతిలో సాగు చేయు విధానాలను, లాభసాటిగా చేయు విధానాలను వివరించారు. కార్యక్రమంలో సాగునీటిసంఘ అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ శివలింగం, నాయకులు బాబు, మహిళా రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడుదాం



**సోమల డిసెంబర్ 3 (ప్రభాతవార్త)** ప్లాస్టిక్ భూతాన్ని పూర్తిగా నిషేధించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత భారత పౌరులపై ఉందని సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్ అన్నారు. ఎన్ఎస్ఎస్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా ఎస్ నడింపల్లిలోవిద్యార్థులతోర్యాలీనిర్వహించిప్రజలకు అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయం వల్ల నాణ్యమైన దిగుబడులు లభించడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ గౌతమ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



**సోమల, డిసెంబర్ 3 (ప్రభాతవార్త)** పాడి రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ముందడుగు వేయాలని జిల్లా పశువైద్యాధికారి ఉమా మహేశ్వరి అన్నారు. సోమల ఆర్ బి కే సెంటర్ నందు రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం మధ్యాహ్నంపాడి రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమల మండలంలో 200 పైగా మినీ గోకులాలు ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని అన్నారు. సాంప్రదాయ పద్ధతులతో వ్యవసాయం చేయడం వల్ల రైతులు ఆర్థికంగా ముందడుగు వేయడంతో పాటు నాణ్యమైన పంటలు పండించవచ్చని అన్నారు. సాంప్రదాయ పద్ధతులు సాగు చేసిన గడ్డి వేయడం వల్ల పాలు నాణ్యత పెరిగి రైతులు ఆర్థికంగా ముందడుగు వేయచ్చని తెలిపారు. సోమల పశువైద్యశాల సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం పెంచేందుకు పథకం అమల్లో ఉందని దీనివల్ల రైతుకు సంవత్సరానికి 32 వేలు ప్రభుత్వము ద్వారా అందుతుందని తెలిపారు. పశువులకు వైద్యం తక్షణం అందించడంలో తమ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని రైతులకు తెలియజేశారు. పశువైద్యాధికారి ని మారసాని చందన ప్రియ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సబ్సిడీ వివరాలు రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు

## డా॥ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



**కుప్పం, డిసెంబర్ 3 ప్రభాతవార్త** మండలంలోని అడవిబూదుగూరు పంచాయతీలో రాజ్యాంగ నిర్మాత డా॥ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు గాను బుధవారం భూమిపూజ కార్యక్రమంను ఎస్సీ, బిసి సోదరులు కలసి నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ చిట్టిబాబు, మాజీ ఎంపిటిసి కృష్ణమూర్తి, ఎంఆర్‌పిఎస్ ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ సుమారు ఇరవై ఏళ్ల కల నెరవేరుతోందన్నారు. కార్యక్రమంలో కుప్పన్న, దేవరాజు, అన్బు, సందీప్, ప్రకాష్, సతీష్ పాల్గొన్నారు.

## నర్సింగ్ వృత్తి మహోన్నతమైంది

– పిఇఎస్ వైద్య కళాశాల డీన్ డా॥ కృష్ణారావు



**కుప్పం, డిసెంబర్ 3 ప్రభాతవార్త** సమాజంలో నర్సింగ్ వృత్తి మహోన్నతమైందని పిఇఎస్ వైద్య కళాశాల డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్ఆర్ కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం పిఇఎస్ కళాశాలలో 2025-26విద్యాసం॥కు గాను ఫస్టియర్ బిఎస్సీ నర్సింగ్ (21వ బ్యాచ్) తరగతులను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి రోగి సేవలో కరుణ మరియు నైతికత గురించివివరించారు. మెడికల్ సూపరింటెండెంట్ డా॥ సుబ్రమణ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకుసాగాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డా॥ర్యాలీ సుబ్బారావు మాట్లాడుతూ కళాశాలలో లభ్యమయ్యే ఉన్నతస్థాయి బోధన, క్రమశిక్షణ తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అభిరామి, వైస్ ప్రిన్సిపాల్ డేనియల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి రెండువందల పుస్తకాల వితరణ



**కుప్పం, డిసెంబర్ 3 ప్రభాతవార్త** స్థానిక గ్రంథాలయానికి కుప్పంకు చెందిన డా॥ శిల్ప, డా॥ చైతన్య కృష్ణలు తమవంతుగా రెండు వందల పుస్తకాలను వితరణగా అందజేశారు. పిల్లలకు ఉపయోగపడే కథలు, బొమ్మల కథా కథనం, గేయాలు, పద్యాలతో కూడిన సుమారు 15వేల విలువ చేసే చక్కటి పుస్తకాలను అందజేశారు. అలాగే మహాభారత పుస్తకాలు సైతం అందించారు. పిల్లలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని పుస్తకాలు బాగా చదవాలని వారు సూచించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా ఛైర్‌పర్సన్ మహేష్, గ్రంథాలయ అధికారిణి సత్యవాణి, ఉమానాగరాజ్, సతీష్‌లు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన



**రామకుప్పం, డిసెంబర్ 3 ప్రభాతవార్త** మండలంలోని బందార్లపల్లి పంచాయతీ కృష్ణానగర్ గ్రామం వద్దమానససరోవర్‌విశ్వవిద్యాలయం ఏర్పాటుకు గాను కూటమినేతలు,వర్సిటీబృందసభ్యులు పరిశీలించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్ యూనివర్సిటీ ఏర్పాటుకు రెండు వందల ఎకరాల భూమి అవసరం అని పేర్కొన్నారు.కార్యక్రమంలో టిడిపి నేతలు ఆనందరెడ్డి, మునిరెడ్డి,శ్రీనాథరెడ్డి, మంజునాథ్ పాల్గొన్నారు.

## ఇ- సైకిళ్లపై ప్రజలకు అవగాహన



**శాంతిపురం, డిసెంబర్ 3 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పంను కాలుష్య రహితం చేసేదిశలో భాగంగా బుధవారం స్థానిక మండల సచివాలయం ఎదుట ఇ -సైకిళ్ల ప్రదర్శన నిర్వహించారు. ఎంపిడిఒ పిఆర్ కుమార్ మాట్లాడుతూ ఇ - సైకిళ్ల ద్వారా కాలుష్యం నివారించడంతో పాటు పెట్రోల్ ఖర్చులు తగ్గుతాయన్నారు. యూనిట్ కరెంట్ చార్జ్‌తో సుమారు నలభై కి.మీ.లు ప్రయాణించవచ్చన్నారు. ఇ - సైకిల్ అవసరమైన వారు తొలుత 5వేలు జమ చేసి మిగతా నగదు వాయిదాల్లో చెల్లించవచ్చన్నారు. ఆసక్తిగల వారు గ్రామ సచివాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## రైతుల లబ్ధికే రైతన్నా..మీకోసం



**శాంతిపురం, డిసెంబర్ 3 ప్రభాతవార్త** రైతుల లబ్ధి కోసమే సిఎం చంద్రబాబునాయుడు రైతన్నా.. మీకోసం కార్యక్రమం చేపట్టారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్‌పేర్కొన్నారు.బుధవారంకెనమాకులపల్లి సచివాలయంలో సిఎం చంద్రబాబునాయుడు కార్యక్రమం వీక్షణ అనంతరం వారు మాట్లాడారు. రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్మిక బోర్డు సభ్యుడు విశ్వ నాథనాయుడు, నేతలు రాజేంద్ర, శివ, గిరి, రమేష్, రాజు, హరినాథరెడ్డి, నాగరాజు, గద్దూరు శివ, రమేష్ పాల్గొన్నారు.

## లక్షల స్వాహా చేసిన సంఘమిత్ర

**పుంగనూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త**



మండలంలోని మంగళం వివో సంఘమిత్ర తమ పేరుతో రూ.లక్షలు స్వాహా చేసిందని జట్టిగుండ్లపల్లి డ్వాక్రా సభ్యులు ధర్నాకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో జట్టుగుడ్ల పల్లెలో శివశక్తి గ్రూపు సభ్యులైన మహిళలు సంఘం పేరుతో పొదుపు చేసుకుంటూ మనుగడ సాగిస్తున్నారు. అయితే సంఘమిత్ర లక్ష్మీదేవి ఏడాది క్రితం ఒక్కొక్క సభ్యురాలు పేరా రూ. 50వేలు తమకు తెలియకుండానే రుణం తీసుకుందని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికారులకు పోలీసులకు తెలియజేసిన ఎటువంటి చర్యలేదని తెలిపారు. పొదుపు సంఘాల సభ్యుల పేరుతో నిధులు కాజేసిన సంఘమిత్రను వెంటనే పిలిచి విచారించాలని ఆమె తీసుకున్న తమ పేరిట రుణాలను కట్టించాలని డిమాండ్ చేస్తూ స్థానిక శ్రీ శక్తి భవనం ముందర ఆందోళనకు దిగారు.

## దివ్యాంగ క్రీడాకారులను అభినందించిన కలెక్టరు



**చిత్తూరురూరల్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** ఈనెల 1,2 తేదిల్లో గుంటూరునందు నిర్వహించిన డిజేబుల్ స్కూల్ బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ మీట్ రాష్ట్రస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా కలెక్టర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. వైకల్యాన్ని అధిగమించి ముందుకుసాగడం అభినందనీయమని కలెక్టరు వారిని కొనియాడారు.

## జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా ఉదయ్‌భాస్కర్



**చిత్తూరురూరల్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా ఉదయ్ భాస్కర్ బుధవారం జిల్లా కలెక్టరును మర్యాదపూర్వకంగా కలసి బాధ్యతలు స్వీకరించారు. గతంలో వున్న పనిచేసిన ఏ బాలాజీ పదవీవిరమణ చేయడంతో సత్యసాయి జిల్లా నుంచి బదిలీపై వచ్చిన ఉదయ్‌భాస్కర్ చిత్తూరు జిల్లా డీఎస్‌డివోగా బాధ్యతలు చేపట్టారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## స్వానిధి సంకల్ప అభయాన్ సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

**పలమనేరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమలు చేస్తున్న స్వానిధి సంకల్ప అభయాన్ పథకం సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగిన బ్యాంకర్లు, లబ్దిదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రధానమంత్రి చేతుల మీదుగా 2020లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిరు వ్యాపారులకు కేవలం 7.5 శాతం వడ్డీలతో రుణాలు అందజేసి వారికి చేయూత నివ్వడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. మొదటి విడతగా పలమనేరు మున్సిపాల్టీలో 2375 మందికి రూ.10 వేలు వంతున, రెండో విడతగా 1245 మందికి రూ.20 వేలు వంతున, మూడో విడతగా 379 మందికి రూ.50 వేలు వంతున రుణాలు అందజేశామని తెలిపారు. తీసుకున్న రుణాలు నిర్దేశించిన గడువు లోపు సక్రమంగా చెల్లిస్తే మరుసటి సంవత్సరం అంతకు రెట్టింపుగా రుణాలు అందజేస్తారని వివరించారు. ఇందులో భాగంగా ఈ సారి 4 విడత 960 మందికి 2.20 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అలాగే విభిన్న ప్రతిభావంతులకు కూడా రూ.65 లక్షల రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. చిరు వ్యాపారులు అధిక వడ్డీలతో రుణాలు పొందడానికి అవస్థలు పడే అవసరం లేకుండా ఉండడానికే ఈపథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమీషనర్ ఎంవి రమణారెడ్డి, సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్‌వి బాలాజీ, వివిధ బ్యాంకుల అధికారులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## రైతుల అభ్యున్నతికే పంచసూత్రాలు

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, డిసెంబర్ 3 ప్రభాతవార్త** రైతుల అభ్యున్నతికే సిఎం చంద్రబాబునాయుడు పంచసూత్రాలు కార్యక్రమంను తీసుకువచ్చారని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం చందం పంచాయతీలో రైతన్నా..మీకోసం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలపై మొగ్గు చూపాలన్నారు. బిందుసేద్యంతో తక్కువ నీటితోనే పంటల అధిక దిగుబడికి ఆస్కారం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సిఎం చంద్రబాబు పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టారన్నారు. ఆవులకు ఉచితంగా లింగనిర్ధారిత వీర్యాన్నిసైతంఉచితంగా అందేలా చర్యలు తీసుకున్నట్లుచెప్పారు. ప్రభుత్వం కూడా రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, సర్పంచ్ జెకె సంతోష్, ఎఎంసి వైస్‌ఛైర్మన్ శరవణ, ఎట ఫయాజ్ బాషా, వెటర్నరీ ఎడి రవిశంకర్, నేతలు హైదర్ వలీ, గాయత్రి, రాధాకృష్ణమూర్తి, తులసిబాబు, మేఘనాథం, గురుస్వామి,దామోదరం నాయుడు, రైతులు పాల్గొన్నారు.

## పాఠశాల బస్సుడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



**చిత్తూరురూరల్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** చిత్తూరు పట్టణం, సంతపేటలోని బృందావన్ పాఠశాలలో బుధవారం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జిఎస్‌వి రాజేశ్వరరావు బస్సులను తనిఖీచేసి డ్రైవర్లకు పలు రహదారి సూచనలు తెలిపారు. వేగపరిమితిని పాటిస్తూ, నిదానంగా, జాగ్రత్తగా బస్సును నడపాలనీ, ముఖ్యంగా విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు వారికి సమయం కేటాయించాలని, వారు కూర్చున్న తర్వాతే బస్సును నడపాలనీ, ప్రయాణానికి ముదు బస్సు టైర్లు, బ్రేకులు, లైట్లను తనిఖీ చేయాలని, అలాగే బస్సులో ఫైర్ ప్రమాదాలు జరగకుండా అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో తెలుసుకొని వుండాలని పలు సూచనలు చేసారు. ఈ తనిఖీలో ఎంవిఐతో పాటు పాఠశాల అధ్యక్షులు విజయభాస్కర్ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



**గంగాధర నెల్లూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త** మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో భవిత వారి ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి ఆంజనేయులు శెట్టి అధ్యక్షతన బుధవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైకల్యంతో ఎన్నో అవరోధాలను కష్టాలను ఎదుర్కొంటు జీవితాన్ని జయిస్తూ మనందరికి పూర్తిదాయకంగా నిలుస్తున్న వారికి మన వంతు సహకారం అందించడమే కాకుండా వారిని గౌరవప్రదంగా చూడాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రస్తుతం దివ్యాంగులు తమ విశేష ప్రతిభ కనబరచి క్రీడా పోటీలలో ప్రభుత్వ ఉద్యోగాలలో రానిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎ ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటరమణ జిల్లా కోఆర్డినేటర్ మధు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బరామయ్య భవిత ఉపాధ్యాయురాలు పుష్పావతి సిఎంఆర్టి కుమారిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రమాదపుటంచుల్లో చౌడేపల్లి బస్‌షెల్టర్



**చౌడేపల్లి, డిసెంబర్ 1 ప్రభాతవార్త** మండల కేంద్రమైన చౌడేపల్లి బస్టాండులో బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా వుంది. దీంతో ప్రయాణీకులు భయాం దోళన వ్యక్తం చేస్తున్నారు. పుంగనూరు, బోయకొండకు వెళ్ళే ప్రయాణీకులు అధిక సంఖ్యలో బస్‌షెల్టర్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే షెల్టర్ పైకప్పు పెచ్చులూడి కిందకు పడుతోంది. ఇటీవల పెచ్చులు తలపై పడి ప్రయాణీకులు క్షతగాత్రులయ్యారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వ వుండి ఎప్పుడు కిందకు పడుదునా...అన్నట్లుగా వుంది. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత సమయంలో ప్రయాణీకులు షెల్టర్ కిందకు రావాలంటేనే భయపడుతున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్థలో వున్న బస్‌షెల్టర్‌ను మరమ్మత్తు చేయించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

## అనవసర ఆరోపణలతో రెచ్చగొట్ట వద్దు



టిడిపి నాయకులకు వైసిపి నేతల హితవు

**పలమనేరు. డిసెంబర్ 3, ప్రభాతవార్త:** అనవసర ఆరోపణలతో రెచ్చగొట్టవద్దని తెలుగుదేశం నాయకులకు వైసిపి నేతలు హితవు పలికారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు హేమంత్‌కుమార్ కన్వీనర్ వెంకటరెడ్డి విలేకర్ల మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు రుజువులు లేకుండా పసలేని ఆరోపణలు చేస్తూ సమయం వృధా చేయవద్దని సూచించారు. ఇటీవల ఓ తెలుగుదేశం నాయకుడు పట్టణ వైసిపి అధ్యక్షుడు హేమంత్‌కుమార్‌రెడ్డిపై తన ఇంటి నిర్మాణానికి అక్రమంగా ఇసుక వాడుకున్నట్లు ఆరోపించారని తెలిపారు. దీనిపై హేమంత్‌కుమార్‌రెడ్డి తాను అక్రమంగా ఇసుక వాడుకోలేదని ఏ తప్పు చేయలేదని శివాలయంలో ప్రమాణం చేసే పరిస్థితి నెలకొందన్నారు. మరి ఆరోపించిన తెలుగుదేశం నాయకుడు రుజువులతో తిరిగి శివాలయంలో ఎందుకు ప్రమాణం చేయలేదన్నారు. లేనిపోని తప్పుడు ఆరోపణలతో బురద జల్లడం ఆ బురద కడుక్కోవడానికి వైసిపి నాయకులు కౌంటర్లు ఇవ్వడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. మీ ఎమ్మెల్యే మమ్మల్ని టార్గెట్ చేసి తిట్టించడమే పనిగా నేర్పుతున్నాడా ఇదేనా మీ సంస్కారం అని నిలదీశారు. ఇక నుండి మీరు ఎన్ని ఆరోపణలు చేసినా పట్టించుకోమనిమీవిజ్ఞతకేవదిలేస్తున్నామన్నారు.నాయకులుచెంగారెడ్డి, జాఫర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణంలో వున్న ఇంట్లో మరోసారి చోరీ

**పలమనేరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** పలమనేరు పట్టణంలోని రాధాబంగ్లా వీధిలో నిర్మిణంలో వున్న ఇంటో మరో సారి చోరీ జరిగింది. కనకదుర్గమ్మ గుడి అర్చకుడు గోపీ స్వామి కొత్తగా ఇల్లు నిర్మిస్తున్నాడు,3 నెలల క్రితం రాత్రి సమయంలో దాదాపు రూ. 1.20 లక్షల విలువైన విద్యుత్ పరకరాలు చోరీ అయ్యాయి.ఐతేఈ నెల 2న రాత్రి మరో సాకి ఇదేఇంట్లో దాదాపు రూ.1.50 లక్షల విలువైన విద్యుత్ఇతర పరికరాలు చోరీ అయ్యాయి. ఈ సంఘటనపై బాధితుడు గోపీ స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**పలమనేరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పలమనేరు భవిత కేంద్రంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండల విద్యాశాఖ అధికారి లీలారాణి, ప్రధానోపాధ్యాయుడు షంషీర్, ఉర్దూ పాఠశాల హెచ్ఎం సాబ్జూ, ఫిజియో థెరఫిస్టు రజని, భార్గవరామ్, మల్లీశ్వరి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఎంఇఓ మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలను ఆదుకోవడానికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమపథకాలు అమలు చేస్తోందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీరికి సరైన శిక్షణ ఇస్తే అన్నిరంగాల్లోరాణిస్తారనివివరించారు.అతిధులుగా వచ్చిన దివ్యాంగులకు స్వీట్లు బిస్కెట్లు పంపిణీ చేశారు.

## రైతుసంఘాల ఏర్పాటుకు కృషి చేయాలి - ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు



**రామకుప్పం, డిసెంబర్ 3 ప్రభాతవార్త** మండలంలో రైతుల సంఘాలు విరివిగా ఏర్పాటు చేయాలని కుప్పం ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. బుధవారం మండల కార్యాలయంలో ఎపిఎం, వెలుగుసిసిలు, ఎపిఒలు, ఎఫ్ఎలు, సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో వారంలోగా రైతు సంఘాలు ఏర్పాటుచేయాలన్నారు. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రయోజనాల గురించి రైతులకు వివరించాలన్నారు. సమావేశంలో నేతలు వెంకటరమణ, ఆంజనేయరెడ్డి, పత్ర నారాయణ, కామరాజనాయక్,నరసింహులు, విజయ్‌కుమార్, సతీష్, పవన్‌కుమార్, మునీంద్రనాయక్, రఫీ, రవిరెడ్డి, రఘు, వెంకటేష్, శంకరాచలం పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## స్థలం కేటాయిస్తే త్రిపురలో శ్రీవారి ఆలయం

-తెలంగాణ గవర్నర్‌తో టిటిడి చైర్మన్ నాయుడు



తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి: త్రిపురరాష్ట్రంలో స్థలం కేటాయిస్తే టిటిడి శ్రీవారి ఆలయాన్ని నిర్మిస్తుందని టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మను కోరారు. గవర్నర్ స్వరాష్ట్రం త్రిపురలో ఆలయాన్ని నిర్మించేందుకు సహకారం అందించాలని ,స్థలం కేటాయిస్తే ఆలయ నిర్మాణం చేపడతామన్నారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లో తెలంగాణ గవర్నర్ శర్మను టిటిడి ఛైర్మన్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను శేషవస్త్రం కప్పి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమలలో అన్నప్రసాదాలు రుచికరంగా, నాణ్యతతో ఉన్నాయని, సౌకర్యాలు బావున్నాయని గవర్నర్ అభినందించారు.

## పరమశివుని ఆశీస్సులతో అంతా మంచి జరగాలి

**తిరుపతి రవాణ, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** కార్తీక భరణి దీపం సందర్భంగా తిరుపతిలోని కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం విశేష అన్నాభిషేకం జరిపించారు. అన్నపూర్ణా దేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామికి పండ్లతో, అన్నంతో ప్రత్యేకంగా నమ:శ్శివాయ నామస్మరణలతో ఆలయఅర్చకులు, నిర్వాహకులు, రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి,



తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపాలు వెలిగించి సకలం శుభాలు కలగాలని వేడుకున్నారు.

## దూరవిద్య పి జి ఫలితాలు విడుదల

**తిరుపతి విద్య,డిసెంబర్ 3 ప్రభాతవార్త**

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిధిలో దూరవిద్య ద్వారా ఎం.ఏ. పొలిటికల్ సైన్స్, ఎం.ఏ. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాల ఫలితాలను విశ్వవిద్యాలయం అధికా రులు బుధవారం విడుదల చేశారు.అలాగే పి.జి. రెగ్యులర్ మూడవ సెమిస్టర్ విద్యార్థులకు ఫీజు చెల్లింపు తేదీలను కూడా ప్రకటించారు. డిసెంబర్ 4 తేదీ నుంచి 12 వ తేదీ లోపు ఫీజు చెల్లించి ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలని డీన్ ఆచార్య సురేంద్రబాబు, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాజమాణిక్యం తెలిపారు.

## దొంగలు బాబోయ్...దొంగలు

**విజయపురం, డిసెంబరు 3 ప్రభాతవార్త:**



దొంగలు బాబోయ్...దొంగలు అంటూ మండలంలో రైతులు భయాబ్రాంతులకు గురవుతున్నారు. మండలంలో ఏడాది కాలంలో దొంగతనాలు పెరుగుతూనే వస్తున్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు కాని వ్యవసాయం చేస్తుంటే మూలిగే నక్కపై తాడిపండు పడినట్టు దొంగలు రైతులపై పడి దొంగతనాలు చేస్తున్నారు. నెల రోజుల్లో రెండు పర్యాయాలు కేబుల్ మార్చామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కళియంబాకం, బూచివానత్తం, పన్నూరు సబ్‌స్టేషన్, ఇళ్ళత్తూరు ప్రాంతాలల్లో తరచూ వ్యవసాయ మోటారు వైర్లు, స్టాటర్లు దొంగలించడం ఆనవాయితీగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఆలపాక కండ్రిగలో గ్రామానికి తాగునీరు సరఫరా చేయు మోటారులో రెండు నెలల కాలంలో మూడు పర్యాయాలు కేబుల్ చోరీకి గురైందని సర్పంచ్ బాబు వాపోయారు.మండలంలోని ఇళ్ళత్తూరులో ట్రాన్స్ ఫార్మర్‌లోకాపర్ దొంగలించడం రైతులు ఇబ్బంది పడడం సర్వ సాధారణంగా మారిందని వాపోతున్నారు. చిన్న చిన్న దొంగతనాలు పోయి ఏకంగా పన్నూరు స్టేట్ బ్యాంకులోనే చోరీకి ప్రయత్నం చేసి విఫలం కావడం దుమారం లేపుతుంది. దొంగలు మద్యం, గంజాయి మత్తుకు బానిసై ఇలా వ్యవహరిస్తున్నారని మండల వాసులు ఆరోపిస్తున్నారు.

## ఆక్రమణలను పట్టించుకోరు:ముంపుకు ఎవరు బాధ్యులు?

భారీ వర్షాలతో గందరగోళం

**తొట్టంబేడు,డిసెంబర్ 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తికి కూత వేటు దూరంలో ఉన్న తొట్టంబేడు మండలంలోని చెరువుల ఆక్రమణలను అడ్డుకోవటంలో రెవెన్యూ అధికారులు ఉదాసీన వైఖరి నేడు శాపంగా మారింది.బుధవారం కురిసిన భారీ వర్షంతో చెరువులు నిండి రోడ్లపై నీరు ప్రవహిస్తుంది.కాలనీల్లో నీరు చేరి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. నిత్యం మీడియాలో ఆక్రమణలకు సంబంధించి వార్తలు వస్తున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.చెరువులు,కాలువలు ఆక్రమణలకు గురి కావటంతో బుధవారం పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.ఈదుల గుంట నుంచి మంచినీళ్ళ గుంట వరకు వరవ కాలువ ఆక్రమణలకు గురైంది. కాలువల్లో భారీ నిర్మాణంలు జరుగుతున్నా రెవెన్యూఅధికారులు నిర్లక్ష్యంగా వ్యవహారించటంతో నేడు శాపంగా మారింది.బుధవారం కొండ కోనల్లోంచి వచ్చిన నీటిని నిల్వ ఉండటానికి అవకాశం లేక గృహాలపై రోడ్లపై దాడి చేస్తుంది.ఈదుల గుంట సర్వే నెంబర్లు 20,21,22,105లో లింకు కాలువ ఉంది.ఇక్కడ కనీసం ఒక్క అడుగు కూడా వదలకుండా ఆక్రమణలు జరుగుతుంటే పట్టించుకోక పోవటంతో నేడు ప్రజలకు శాపంగా మారింది. వర్షాల పరిస్థితి ఇలాగే కొనసాగితే పరిస్థితి ఏమిటో ముక్కంటీశునికే ఎరుక.

***మండలంలో ఆగమ్యగోచరం:***

తొట్టంబేడు మండలంలో గ్రామాల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ముఖ్యంగా చిట్టత్తూరు వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్థంభించాయి.లక్ష్మీపురం వద్ద కాలువ పొంగి పోర్లటంతో రాకపోకలు స్థంభించాయి, బుధవారం ఉదయం నుంచి కుండపోత వర్షం కురుస్తుంది. అలాగే ఉరుములు,మెరుపులతో జనం భయబ్రాంతులౌతున్నారు.

## జాతీయస్థాయి కుస్తీపోటీలకు ఎంపికైన 24మంది క్రీడాకారులు

**చిత్తూరురూరల్, డిసెంబరు 3 ప్రభాతవార్త:**



గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న 12వ రాష్ట్ర స్థాయి(ఫ్రీ స్టైల్, గ్రీకో రోమన్, బాలికల ఫ్రీ స్టైల్ విభాగం) కుస్తీ పోటీల్లో 24మంది క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆలిండియా రెజ్లింగ్ ఫెడరేషన్ సంయుక్త కార్యదర్శి ఆర్కే పురుషోత్తం తెలిపారు. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు 125మంది బాలురు, 50మంది బాలికలు హాజరయ్యారన్నారు. ఈనెల 12, 13, 14వ తేదిల్లో గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాదు నగరం నేషనల్ స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన 24మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ముఖ్యంగా 2008వ సంవత్సరం నుంచి రెజ్లింగ్ విభాగంలో భారతదేశానికి క్రమం తప్పకుండా పతకాలు వస్తున్నాయని, ప్రపంచ స్థాయిలో భారతదేశానికి మంచిపేరు వుందని, దేశంలో ప్రపంచస్థాయి కుస్తీ క్రీడాకారులు వుండడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఏపిఓఏ రాష్ట్ర కోశాధికారి ఆర్ శ్రీనివాసన్, ఏపి రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టిఆర్ కుమార్, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ వ్యవస్థాకులు సుదర్శన్‌రెడ్డి, పివికెయన్ ప్రభుత్వడిగ్రీ కళా శాల రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ఎన్ వెంకటస్వామిరెడ్డి, పలువురు మ్యాచ్ రెఫరీలు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుకు గండి వృధాగా పోతున్న నీరు

**చౌడేపల్లి, డిసెంబర్ 3 ప్రభాతవార్త**



మండలంలోని పంచాయతీ కేంద్రం 29ఎ.చింతమాకులపల్లి చెరువుకు గండి నీరు వృధాగా పోతున్నాయి. దాదాపు 56ఎకరాల విస్తీర్ణము, 50మంది రైతులు ఆయకట్టుదారులుగా వున్న చెరువుకు ఇటీవల మెంథా, దిత్వా తుఫాన్‌ల ప్రభావంతో భారీగా వర్షపునీరు వచ్చి చేరాయి. కట్ట బలహీనంగా వుండటంతో తూము పక్కనే గండి పడి దానిద్వారానే నీరు వృధాగా పోతున్నాయని రైతులు తెలిపారు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పందించి బలహీనంగా వున్న చెరువు కట్టకు మరమ్మత్తులు చేయించాలని వారు కోరుతున్నారు.

## రైతులు డిమాండ్ ఆధారిత పంటలవైపు మొగ్గు చూపాలి

**భాకరాపేట, డిసెంబర్ 3 ప్రభాతవార్త**



చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఉద్యానవన అధికారిని ఆశియా రైతులతో మాట్లాడుతూ వ్యవసాయనికి పంచసూత్రాలైన నీటిభద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రెసెసింగ్, మరియు ప్రభుత్వ మద్దతు గురించి రైతులతో చర్చించారు ఈ కార్యక్రమం లో చిన్నగొట్టిగల్లు రైతు సేవకేంద్రం సిబ్బంది కుమార్ నాయక్, సిరికల్చర్ టి ఏ వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు

## గుడిసె కూలి మహిళ మృతి

**తొట్టంబేడు,డిసెంబర్ 3 ప్రభాతవార్త**



తొట్టంబేడు మండలం కాసరం గ్రామంలో బుధవారం గోడకూలి పి.రేణుకమ్మ(59) అనే మహిళ మృతి చెందినట్లు విఆర్ఓ తెలిపారు.స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.గ్రామానికి చెందిన కృష్ణయ్య సుమారు 15నెలల క్రితం మరణించాడు. ఆమె కుమారుడు గుడిసె పక్కన ఉన్న పక్కాగృహంలో నివాసం ఉంటున్నారు.వారితో నివాసముంటున్న రేణుకమ్మ కోడలితో గొడవ పడి తమ సొంత ఇల్లు గుడిసెలోకి వెళ్ళారు.అయితే భారీ వర్షాలతో గోడకూలి మృతి చెందినట్లు సమాచారం.సమాచారం అందిన వెంటనే తహశీల్దార్ భారతి సంఘటన స్థలాన్ని సందర్శించారు.అయితే వర్షాకాలంపూర్తి అయ్యే వరకు పూరి గుడిసెల్లో ఉండరాదని అయితే కాసరం సంఘటన బాధాకరమని తహశీల్దార్ భారతి అభిప్రాయపడ్డారు.

## పానగల్‌లో రెగ్యూలేషన్ స్కిం



నోటిఫికేషన్ జారి చేసిన కమిషనర్

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 3 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని పానగల్ రెవెన్యూలలో భూమికి లే అవుట్ రెగ్యూలరేజేషన్ చేస్తూ బుధవారం మునన్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ నోటిఫికేషన్ జారి చేసారు.ఈ మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాలతో లే అవుట్ ప్యాట్రన్‌ను జారి చేసినట్లు వివరించారు.ఈ భూములకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలుపవలయునని వివరించారు. సర్వే నెంబర్లు 90/2జి,304/3బి,86/1,2,,5, 6,7,8 మరియు 85,166/11,161/1, 157/7,8,157/4,5, 150/2ఊ,3ఊ,4ఊ,5,147/1,161/1పి,6పి,162/4ప4,6పి,7,8పి,123/7సి మరియు 123/6పి, 129/1పి,2,128/7,130/3,4,137/1పి,2పి,123/7పి, 124/9పి,289/4, 117/192/2,9, 11,13, 14,15,16ఊపిఎల్‌పి 2020/తుడా/ శ్రీకాళహస్తి/001008లు ఉన్నాయని వివరించారు.

## గంగమ్మ జాతర పోస్టర్ల ఆవిష్కరణ

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 3 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో నిర్వహించే ఏడు గంగమ్మల జాతరకు చుట్టుపక్కల నియోజక వర్గాల నుంచి భక్తులను ఆహ్వానించుటకు దేవస్థానం ముద్రించిన పోస్టర్లను స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిచే ఇటీవల ఆవిష్కరించారు.ఈ నెల 7 రాత్రి చాటింపుతో జాతర సంబరాలు ప్రారంభం అవుతాయి. ఈ నేపధ్యంలో జాతరకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ 9వ తేది మంగళ వారం అర్ధరాత్రి దాటిన తరువాత గంగమ్మల ఊరేగింపు,10వ తేది ఏడు స్థావరాల్లో గంగమ్మల ప్రతిష్ట మొక్కులు తీర్చుకొనుటకుఅ వకాశం అలాగే 9వ తేది అమ్మవార్లకు దేవస్థానం తరపున సారె అందించే కార్యక్రమాలను నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు.

## గ్రామీణ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి!

**ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్)డిసెంబర్ 3 ప్రభాతవార్త**



ఏర్పేడు మండలంలోని గ్రామాల్లో తెలుగు దేశం పార్టీని బలోపేతం చేయాలని బుధ వారం జరిగిన దుర్గిపేరి,పల్లం పేట పంచాయతీల్లో జరిగిన సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు అన్నారు.ఇప్పటికే గ్రామాల్లో అన్ని వర్గాలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలతో ఎంతో సంతృప్తిగా ఉన్నారని వివరించారు. నేడు కూటమి ప్రభుత్వం ప్రతి ఇంటిలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమాల్లో నాయి బ్రాహ్మణ సంఘ రాష్ట్ర అద్యక్షులు సదాశివం, పార్టీ నాయకులు పేరం ధనంజయులునాయుడు, శివశంకర్‌రెడ్డి, చెలికం పాపిరెడ్డి, నైనారు పున్నారావు గాలి కృష్ణవేణి, మహేష్‌రెడ్డి, కృష్ణప్పమొదలియార్, సీతాపతి ఆచారి, బాబునాయుడు, కేశినేని సుబ్రమణ్యం, రాఘవేంద్ర, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంను కలసిన గాలి

**తొట్టంబేడు,డిసెంబర్ 3 ప్రభాతవార్త**



వైకాపా హయాంలో దాడులకు గురైన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గాలి చలపతినాయుడు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసారు. పార్టీ కష్టకాలంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని కార్యకర్తలు,ద్వితీయ శ్రేణి నాయకులకు భరోసా కల్పిస్తూ పార్టీ కార్యక్రమాలను కొనసాగించారు.ఆది నుంచి పార్టీలో ఉంటూ పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రయత్నించారు. నియోజకవర్గంలో కీలకమైన నేతగా ఉన్న పోతుగుంట గురవయ్యనాయుడు కుటుంబసభ్యులుగా రాణించారు.ఇటీవల పార్టీ అధినేత పలు నియోజకవర్గాలకు పరిశీలకులుగా నియమించారు.ఈ నేపధ్యంలో రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న గాలి చలపతి నాయుడును మదనపల్లి నియోజకవర్గ పరిశీలకులుగా నియమించారు.ఇక్కడ చోటు చేసుకున్న పార్టీ వ్యవహారాలకు సంబంధించిన సమగ్ర నివేదికను గాలి చలపతి నాయుడు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు అందించారు.

## నేడు గురుదత్త జయంతి

**తొట్టంబేడు,డిసెంబర్ 3 ప్రభాతవార్త**



మండలంలోని పెద్ద కన్నలి పంచాయతీ కొత్త కన్నలి గ్రామంలో గురువారం దత్తజయంతి వేడుకలను నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు. ఆధ్యాత్మిక దివ్యక్షేత్రం శ్రీకాళ హస్తికి సమీపంలోని తొట్టంబేడు మండలంలో పలు ఆలయాలు వెలసి భక్తుల కొంగుబంగారంగా విరాలజిల్లుతున్నాయి. సద్గురు దత్తానంద మహారాజ్ మార్గ నిర్దేశంతో ఉదయం 6గంటలకు పూజలు,అభిషేకాలు,దత్త హోమాలు నిర్వహించబడుతుందన్నారు. మధ్యాహ్నం 12గంటలకు ప్రసాదవితరణ,సాయంత్రం 7గంటలకు భజనలు నిర్వహించబడుతుందని నిర్వాహకులు వివరించారు. గంధం శ్రీనివాసులు సారధ్యంలో భజనలు నిర్వహించబడుతుందన్నారు.

## ఇలగనూరులో రైతన్న మీ కోసం

**తొట్టంబేడు,డిసెంబర్ 3 ప్రభాతవార్త**



మండలంలోని ఇలగనూరులో రైతన్న మీ కోసం కార్యక్రమాలను వ్యవసా యశాఖ అధికారులు నిర్వహిం చారు.ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పంచ సహాయాలను గురించి వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహాయ కార్యక్రమాలు వ్యవసాయ పరంగా ఆచరించాల్సిన విధానాలను వివరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ముఖాముఖి కార్యక్రమాలను రైతులకు వివరించారు.ఈ కార్యక్రమాల్లో ఆయకట్టు సర్పంచ్ దావులూరు సుశేఖర్‌నాయుడు, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటి అధ్యక్షులు ఇఇడూరు రామయ్య, పెళ్ళూరు శివ, నక్క నాగూర్, ఎల్లసిరి కుమార్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ పవన్ కుమార్, ఇలగనూరు రైతులు పాల్గొన్నారు.

## విజన్‌తో మండల సమాఖ్యల అభివృద్ధి

– డిఆర్‌డిఎ పిడి శోభన్‌బాబు



**తిరుపతిరూరల్, డిసెంబర్ 3 ప్రభాతవార్త:** ప్రతి మహిళ విజన్ కలిగి ఉండాలని, ఆ కలను కార్య రూపం దాల్చేందుకు కృషి చేయాలని డిఆర్‌డిఎ పిడి టియన్.శోభన్‌బాబు తెలిపారు. గ్రామ, మండల సమాఖ్యల విజన్ అమలుతోనే మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ శక్తీకరణ సాధ్యమైతుందని తెలిపారు. బుధవారం తిరుపతిరూరల్ మండలం ఎంపిడిఓ సమావేశ మందిరములో వెలుగు ప్రాజెక్టు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విజన్ మాడ్యుల్-1 శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. నాలుగురోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వెలుగు ప్రాజెక్టు లక్ష్యంగా పెట్టుకున్న మహిళల జీవనోపాధి సుస్థిరీకరణలో ఈ శిక్షణ ఎంతో కీలకమని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఎపిడి ప్రభావతి, డిపిఎంలు వెంకటేష్, మాధవి, ట్రైనర్లు మునెయ్య, నరసింహులు, ఎపిఎంలు రాధమ్మ, నాగేశ్వరరావు , మండల సమైక్య కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని పది మండలాల ఎపిఎంలు, సిసిలు, అకౌంటెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల, కోతుల సమస్యను పరిష్కరించండి



వైసిపి నాయకుల వినతి

**పుత్తూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త :** పుత్తూరు మునిసిపాలిటీ పరిధిలో పెచ్చు మీరిన కుక్కలు, కోతుల సమస్యను పరిష్కరించాలని మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాశ్ (చిట్టి) కమిషనర్ నాగేశ్వరరావును కోరుతూ బుధవారం వినతిపత్రం సమర్పించారు. మునిసిపాలిటీలోని 27 వార్డుల్లో కోతుల బెడద వున్నప్పటికీ కుక్కల సమస్య విపరీతమైపోయి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వీరు తెలిపారు. చాలా వీధుల్లో పిచ్చికుక్కలు కరవడం వల్ల ప్రజలు తీవ్ర గాయాలపాలైన సంఘటనలున్నాయని తెలిపారు. గత నెలలో సుప్రీంకోర్టు సైతం ప్రజల నివాసిత ప్రాంతాల్లో ప్రమాదకరమైన జంతువులు సంచరించడం సబబు కాదని పేర్కొంటూ పలు రాష్ట్రాల ముఖ్య కార్యదర్శులకు హెచ్చరిక జారీ చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎన్జీవో కాలనీ తదితర ప్రాంతాల్లోనైతే వందకు పైగా కుక్కలు సంచరిస్తుండడం వల్ల స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. మాజీ మంత్రి, వైసిపి నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆర్.కె.రోజా ఆదేశాల మేరకు తాము ఈ విషయమై తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కౌన్సిలర్ ఏకాంబరం, వైసిపి నాయకుడు చక్రపాణి వున్నారు

## ప్రొటోకాల్ ఉల్లంఘన...

ఈవో నిర్లక్ష్య వ్యవహారంపై సీపీఎం ఆగ్రహం

***కేవీబీ పురం, డిసెంబరు 3 ప్రభాతవార్త:***సురుటుపల్లి శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానం ఈవో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పట్ల ప్రొటోకాల్‌ను పాటించకుండా ప్రవర్తించడంపై సీపీఎం పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజల ఓట్లతో ఎన్నికైన శాసన సభ్యుడి గౌరవాన్ని అగౌరవపరిచే విధంగా దేవస్థానం అధికారి వ్యవహరించడం అంగీకారయోగ్యం కాదని సత్యవేడు నియోజకవర్గ సీపీఎం కార్యదర్శి దాసరి జనార్దన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచి బాధ్యతలు స్వీకరించిన ప్రజాప్రతినిధిని రాజకీయ కోణంలో చూస్తూ అవమానించడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని ఆయన మండి పడ్డారు. నియోజకవర్గంలో అధికార పార్టీ వర్గ పోరాటాలకు కొందరు అధికారులు అడ్డం పడుతూ ఒక వర్గం చేతి బొమ్మల్లా వ్యవహరించడం ఆందోళనకరమని జనార్ధన్ విమర్శించారు. దేవస్థానం ఈవో నిర్లక్ష్య వైఖరి జిల్లాలో పెద్ద చర్చనీయాంశమైందని, వెంటనే జిల్లా అధికారులు జోక్యం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## శివాలయంలో కార్తీక దీపోత్సవం

**పుత్తూరు రూరల్, డిసెంబరు 3 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో తమిళ కార్తీక మాసం కృత్తిక సందర్భంగా ఆలయంలో దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం ఆలయంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామికి అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పరివార దేవతలకు అభిషేకాల అలంకరణలు చేశారు. అలాగే సాయంత్రం ఆలయ ఆవరణలో మహిళలు అధిక సంఖ్యలో హాజరై కృత్తిక, తమిళ కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు. అలాగే పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిఆలయంమండలపరిధిలోనిపలుశివాలయాల్లోకార్తీక దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు.



## ఎస్వీ వ్యవసాయ కళాశాలలో రైతన్న మీకోసం కార్యక్రమం



**తిరుపతి విద్య, డిసెంబర్ 3 ప్రభాతవార్త** ఎస్‌వి వ్యవసాయ కళాశాలలో బుధవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అధ్యాపక బృందం,విద్యార్థిని విద్యార్థులు వివిధ రైతు సేవా కేంద్రాలలో జరిగిన కార్యక్రమంలో పాలుపంచుకొని అన్నదాతలతో మమేకమై రైతులకు వ్యవసాయం లాభసాటి కావడానికి ప్రభుత్వం చేపట్టిన పంచ సూత్రాల లక్ష్యాలను రైతులకు వివరించారు. క్షేత్రస్థాయిలో రైతాంగ సమస్యలను అర్థం చేసుకోవడానికి తిరుపతి గ్రామీణ మండలంలో బ్రాహ్మణపట్టు, దుర్గసముద్రం, గొల్లవానిపల్లి, చంద్రగిరి మండలంలో శానంబట్ల, చంద్రగిరి, దోర్నకంబాల గ్రామాలలో పాల్గొని లాభసాటి వ్యవసాయానికి పంచ సూత్రాలను రైతులకు వివరించారు. చంద్రగిరి రైతు సేవా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ ప్రసాద్ రావు, మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్, వ్యవసాయ కళాశాల విద్యార్థిని విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు. విద్య 1 ఆమె మాట్లాడుతూ గ్రామాలలో బాల్య వివాహాలు నిర్వహిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్థులను కోరారు. బాలికలను లైంగిక వేధింపులకు గురిచేస్తే ఫోక్సో చట్టం ద్వారా కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అరుణ, టీచర్ మారయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రావణీ, దేశమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్య పరీక్షలో

రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన ఎస్వీ వైద్య కళాశాల

**తిరుపతి హెల్త్, డిసెంబర్ 3 ప్రభాతవార్త**



ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు ఆధ్వర్యంలో గత నెలలో జరిగిన పీజీ వైద్య విద్య పరీక్షలలో వివిధ విభాగాలకు చెందిన పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో మార్కులు, వివిధ విభాగాలు ముందంజలో నిలబడడం చాలా శుభ పరిణామమని ఈ సందర్భంగా ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు, వివిధ విభాగ అధిపతులకు, వైద్య అధ్యాపకులకు, వైద్య సిబ్బందికి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి మొదటి ర్యాంకులో ఉత్తీర్ణులైన పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు దేశంలో ఎక్కడైనా పేదలకు మెరుగైన వైద్యం అందించటంలో ముందుంటారని, ఈ వైద్య విద్యార్థుల వల్ల ఎస్‌వి వైద్య కళాశాల ఉత్తమమైన వైద్య విద్యను అందిస్తుందని ఈ సందర్భంగా ఆయన వైద్య విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. అక్టోబర్ 2025లో జరిగిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేట్ పరీక్షలలో విశ్వవిద్యాలయంలో అత్యధిక మార్కులు సాధించిన విభాగాలు బయోకెమిస్ట్రీ విభాగంలో రాష్ట్రం 1వ స్థానం: డాక్టర్ స్నేహ, 2వ స్థానం: డాక్టర్ మౌనికా, ఫార్మకాలజీ విభాగంలో రాష్ట్రం 1వ స్థానం, డాక్టర్ ఎం. శ్రీలక్ష్మి, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో రాష్ట్రం 1వ స్థానం, డాక్టర్ జనని 5వ స్థానం: డాక్టర్ అరవింద్, సైకియాట్రీ విభాగంలో రాష్ట్రం 1వ స్థానం, డాక్టర్ సుహాని, పీడియాట్రిక్స్ విభాగంలో రాష్ట్రం 1వ స్థానం: డాక్టర్ కె.ఎస్.పవిత్ర, రాష్ట్రం 2వ స్థానం: డాక్టర్ శరణ్య మురుగేషన్, నేత్ర వైద్యం విభాగంలో రాష్ట్రం 1వ స్థానం: డాక్టర్ బి.శ్రావణిలు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా పీజీ వైద్య విద్యార్థులను అవార్డులతో సత్కరించి పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన తెలిపారు.ఎస్‌వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డిఎస్ఎన్ మూర్తి, డాక్టర్ ఏఎస్ కిరీటి, డాక్టర్ భారతి ఫార్మ కాలేజీ విభాగాధిపతి, డాక్టర్ లక్ష్మి ప్రొఫెసర్, వైద్య విద్యార్థులు, ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ తదుతరులు పాల్గొన్నారు.

## గంగమ్మకు లక్షరూపాయలు విరాళం



**తిరుపతిరవాణ, డిసెంబర్ 3ప్రభాతవార్త:** తాతయ్య గుంట గంగమ్మ ఆలయం అభివృద్ధికి దాత ,భక్తురాలు లక్షరూపాయలు విరాళం అందజేశారు. బుధవారం ఉదయం తిరుపతిశ్రీ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ సి.ప్రకా శ్‌గుప్త లక్షరూపాయలను ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఈఓ జయకుమార్‌కు అందజేశారు. దాతకు అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందించారు.

# ఏపీలో కాంగ్రెస్ పార్టీకి మళ్లీ పూర్వ వైభవం వస్తుంది

**- ఏఐసీసీ కార్యదర్శి యంపీ సుధా రామకృష్ణన్**



వెంకటగిరి, డిసెంబర్ 3 ప్రభాతవార్త : ఏపీలో కాంగ్రెస్ పార్టీకి మళ్లీ పూర్వ వైభవం వస్తుందని కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్, ఏఐసీసీ సెక్రటరీ, తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ సుధా రామకృష్ణన్‌లు స్పష్టం చేశారు. వెంకటగిరి లోఅసెంబ్లీ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నియోజక వర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పార్టీ అధ్యక్షులను కూడా నియమిస్తున్నట్లు తెలిపారు. దేశం, ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని తెలిపారు. మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతా మోహన్ మాట్లాడుతూ మన్నవరం బెల్ ఫ్యాక్టరీ, దుగరాజపట్నం ఓడరేవు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐఐటి, ఐసర్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను విభజన చట్టంలో పెట్టి, తిరుపతికి తీసుకొచ్చామన్నారు. ఢిల్లీ నుంచి ఏఐసిసి పరిశీల కులుగా సుధా రామకృష్ణన్ రావడం జరిగిందన్నారు. నాయకులు, కార్యకర్తలు అభిప్రాయం సేకరించి ఢిల్లీకి నివేదిక పంపుతారని తెలిపారు. బిజెపి, టిడిపి, వైసిపి ప్రాంతీయ పార్టీల వల్ల ఉపయోగం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, మదన్‌మోహన్‌రెడ్డి, పంటా శ్రీనివాసులురెడ్డి, బాల గురువం బాబు, పూల చంద్రశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లోకి ఉద్యమం

**- సీఎంకు 10 వేల పోస్ట్ కార్డులు పంపిస్తాం - నెల్లూరులో కలిపేంత వరకూ పోరాటం**
**- జేసీసీ సెంట్రల్ కమిటీ కన్వీనర్ దశరథ రామిరెడ్డి - రోటరీ భవన్‌లో జేసీసీ సభ్యుల సమావేశం**



గూడూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త : పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ఉద్యమాన్ని తీసుకెళుతామని గూడూరు జిల్లా సాధన సమితి జేసీసీ సెంట్రల్ కమిటీ కన్వీనర్ బి. దశరధ రామిరెడ్డి అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని రోటరీ భవన్లో జేసీసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 20 రోజుల కార్యాచరణను రూపొందించారు. బుధవారం సాయంత్రం పోస్టు కార్డుల ఉద్యమాన్ని ముత్యాలపేట సెంటర్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుండి ప్రతి ఒక్కరి సహకారంతో ముఖ్యమంత్రి కార్యాలయానికి 10 వేల పోస్టు కార్డులు పంపించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జేసీసీ నాయకులు శంకర్ రెడ్డి, నాసిన భాస్కర్ గౌడ్, జీ. శశి కుమార్, పామంజి మణి, ఎంబేటీ చంద్రయ్య, షేక్ జమాలుల్లా, ఆర్టీసీ యూనియన్ నాయకులు వైవీ. నారాయణ, వై. శ్రీనివాసులు, ఎం.సునీల్, వై. సునీల్, సిసింద్రీ, గౌస్ బాషా, ఎండి. ఇబ్రహీం, షేక్ ఇబ్రహీం, లేబాకు సుబ్బయ్య, ఫయాజ్, పఠాన్ అలీఖాన్, చల్లా వెంకటేశ్వర్లు, సాయినాథ్, శ్రీనివాసమూర్తి, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

## భారీ గండి పడిన ఆర్ అండ్ బి రోడ్డు



వాకాడు, డిసెంబర్ 3 ప్రభాతవార్త: దిత్వా తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు భారీగా ఆర్అండ్‌బి రోడ్లు గండులు పడ్డాయి. బుధవారం వాకాడు మండలం నెల్లిపూడి పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డి పాలెం ఆర్ అండ్ బి రోడ్డుకి ఇరువైపులా భారీగా గండి పడడంతో గ్రామస్తులు అధికారులకు తెలియజేయడంతో తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయి ప్రసాద్‌లు పరిశీలించారు, తహసిల్దార్ స్పందించి సంబంధించిన ఆర్అండ్‌బి అధికారులకు తెలియపరిచారు. అదేవిధంగా వాకాడు చెరువు కాజ్వే వద్ద నీరు రావడంతో వాహనాలు ఆగిపోయాయి, ముట్టెంబాక నుండి పలు గ్రామాలకు వెళ్లే రహదారి కూడా వరద నీరు ఉధృతంగా రావడంతో అటువైపు వెళ్లే వాహనాలు అంతరాయం కలిగింది. మండలంలోని సుమారు 1000 ఎకరాలు పైగా వేసిన పైర్లు నీటిలో మునిగిపోయాయి. రైతులను ఆదుకోవాలని సంబంధించిన అధికారులను కోరారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలతో పాటు, ప్రభుత్వ కార్యాలయాలు ఆవరణంలో వర్షపు నీరు ఉండడంతో నదులను తలపిస్తున్నాయి.

## ఓజిలిలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

ఓజిలి, డిసెంబర్ 3 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని భవిత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మండల విద్యాశాఖ అధికారి శైలజ విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ మేనరిక వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. దివ్యాంగులు ఎవరికీ తీసిపోరని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పి బండి కీర్తన, దాసరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ ఆశ్రమ భవన నిర్మాణానికి చేయూత

నాయుడుపేట రూరల్, డిసెంబర్ 3 ప్రభాతవార్త: పట్టణంలోని మేరీ అనాథాశ్రమ భవన నిర్మాణానికి వైసీపీ నేత, హర్ష పెట్రోలియమ్స్ అధినేత కట్టా భవాని శంకర్‌రెడ్డి ఆర్థిక చేయూత అందించారు. బుధవారం అనాథాశ్రమ నిర్వాహకులు సునీత బెన్నీకి పదివేల రూపాయల నగదు అందజేశారు. ఈ సందర్భంగా కట్టా భవానీ శంకర్‌రెడ్డికి ఆశ్రమ నిర్వాహకులు సునీతా బెన్నీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## జలదిగ్బంధంలో జడ్పీ హైస్కూల్



నాయుడుపేట రూరల్, డిసెంబర్ 3 ప్రభాతవార్త: మండలం కాపులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భారీ వర్షాలతో జలదిగ్బంధంలో చిక్కుకుంది. దిత్వా తుపాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు చేరింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. అదనపు గదుల నిర్మాణ పనులు పూర్తి చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## గిరిజన కుటుంబాలకు ఆహారం పంపిణీ



సూళ్లూరుపేట, డిసెంబర్ 3 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలోని బాపూజీ కాలనీలో ఉన్న గిరిజన కుటుంబాలకు బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గిరిజన కాలనీకి వెళ్లి వారికి ఆహారం పంపిణీ చేయడంతో పాటు గిరిజనుల కోరిక మేరకు కాలనీలో త్వరితగతిన సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ ఛైర్మన్ ఎజి కిషోర్, టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పచ్చా మాధవనాయుడు, చిట్టేటి పెరుమాళ్లు, అలవల శ్రీనివాసులు, వెంకి యాదవ్, ఆలీభాయ్, శ్రీధర్, పామూరు మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం

సూళ్లూరుపేట, డిసెంబర్ 3 ప్రభాతవార్త: శ్రీ బాలాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం హనుమత్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి మోతుకూరి ప్రియవర్ధన్, లావణ్యకుమారి ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవస్థానం ఛైర్మన్ వాకిచర్ల రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## చాపల కాలువను పరిశీలించిన తహశీల్దార్

సూళ్లూరుపేట, డిసెంబర్ 3 ప్రభాతవార్త : మండల పరిధిలోని చిన్న ఉల్సాపడవ గ్రామానికి వెళ్లే చాపల కాలువను తహశీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఇ రమేష్‌బాబుతో కలిసి బుధవారం పరిశీలించారు. బుధవారం మధ్యాహ్నానికి 68.0 మి.మీల వర్షపాతం నమోదైనట్లు గోపీనాథ్‌రెడ్డి తెలిపారు.

## బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : ఎమ్మెల్యే



తడ, డిసెంబర్ 3 ప్రభాతవార్త : తకాదలూరు వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే విజయశ్రీ అధికారులను ఆదేశించారు. తడ మండలంలో దిత్వా తుఫాను ప్రభావిత ప్రాంతాలు వాటంబేడు, కారిజాత, కాద లూరు గ్రామాలను ఎమ్మెల్యే విజయశ్రీ సందర్శించారు. వాటంబేడు గ్రామంలో వసతులు రోడ్లు డ్రైన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేని కోరారు. ఇప్పటికే వాటంబేడు గ్రామంలో 25 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని మిగిలిన వాటిని కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కారిజాత కాదలూరు గ్రామాలలో నీట మునిగిన పంట పొలాలను ఎమ్మెల్యే విజయశ్రీ పరిశీలించారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీధర్, సెల్వం, పళని, ఏలూరు చంద్రయ్య, సుదర్శన్, మునెంద్రయ్య తహసిల్దార్ శరత్ బాబు, ఎంపీడీవో శేఖర్ నాయక్ ఇరిగేషన్ డిఈ కస్తూరి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హరిహర రైస్‌మిల్లు జలమయం

కోట, డిసెంబర్ 3 ప్రభాతవార్త : భారీ వర్షాల కారణంగా కోట క్రాస్‌రోడ్డులో ఉన్న శ్రీ హరిహర రైస్‌మిల్లులోకి నీటి ప్రవాహం చేరింది. దీంతో లక్షలాది రూపాయలు విలువైన బియ్యం తడిసిపోయిందని బాధితుడు శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా రోడ్లు లెవలింగ్ లేకపోవడంతో ఎప్పుడు వరద వచ్చినా తన మిల్లు చుట్టూ వరద ప్రవాహం చేరిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఇన్స్ట్రక్టర్ పోస్ట్‌కు దరఖాస్తులు చేసుకోండి

బాలాయపల్లి, డిసెంబర్ 3 ప్రభాతవార్త: మండలంలోని కామకూరు ప్రాథమికోన్నత పాఠశాల నందు అకడమిక్ ఇన్స్ట్రక్టర్ ఎస్‌జిటి పోస్ట్‌కు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ నాగేశ్వరరావు తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తులను బాలాయపల్లి ఎంఈఓ కార్యాలయంలో ఈనెల 5వ తేదీ లోపల అందజేయాలని చెప్పారు.

## విరివిగా రుణాలు మంజూరు చేయాలి



తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 3 ప్రభాతవార్త : బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమీషనర్ ఎన్. మౌర్య బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఇంచార్జి జాయింట్ కలెక్టర్ మరియు మున్సిపల్ కమీషనర్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్‌డిఓ రాజేష్ కుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ ఆర్ ఎం పరమేశ్వర్ నాయక్, నాబార్డ్ డిడిఎం సునీల్, ఎల్‌డి ఎం రవి కుమార్‌లతో కలసి డి సిసి/ డిఎల్ఆర్ సి 2వ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి జాయింట్ కలెక్టర్ మరియు మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, ఎస్‌హెచ్‌జి లు రుణాలు మరియు వ్యవసాయ, పాడి రైతులకు రుణాలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. ప్రైవేట్ బ్యాంకర్లు అందరు విద్యా రుణాలను మంజూరు చేసి పురోగతి సాధించాలన్నారు. విలేజ్ అగ్రికల్చర్ ఆఫీసర్ ద్వారా క్రాప్ ఇన్సురన్సు పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. క్రాప్ లోన్స్‌కు అర్హత కలిగిన లబ్దిదారులకు క్రాప్ ఇన్సురెన్స్ కవర్ అయ్యేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, జిల్లా వ్యవసాయ, హార్టి కల్చర్, పశు సంవర్థక శాఖ అధికారులు ప్రసాద్, దాశరథ రామిరెడ్డి, రవికుమార్, మెప్మా పిడి ఇఫ్రైన్, మేనేజర్లు, బ్యాంకర్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ముందడుగు వేసేలా మనోధైర్యం

**- అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఎస్పీ తుషార్ డూడి**



చిత్తూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త: దివ్యాంగులను సమాజం అర్థం చేసుకుని వారిని ప్రోత్సహించి ముందడుగు వేసేలా మనోధైర్యం కల్పించాలని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. పివికెఎన్ డిగ్రీ కళాశాల సమీపంలోని జ్యోతిరావు పూలే(బిసి)భవన్‌లో బుధవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం-2025 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడి, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడెల్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, దివ్యాంగుల సంక్షేమశాఖ ఇన్‌ఛార్జీ సహాయ సంచాలకులు విక్రమ్‌రెడ్డి, డిఎస్పీ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులు, అందుబాటులో వున్న సక్షేమ పథకాల గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలన్నారు. సమాజం మొత్తం దివ్యాంగులను అర్థం చేసుకుని వారిని ప్రోత్సహిం చాల్సిన అవసరం వుందన్నారు. దివ్యాంగులపై ఎవరైనా అన్యాయానికి పాల్పడినా, వేధింపులు లేదా హక్కులకు ఉల్లంఘన కల్పించినా సత్వరం పోలీసులను సంప్రదించాలన్నారు. మేయర్ కఠారి హేమలత మాట్లాడుతూ దివ్యాంగులు మనోధైర్యంతో ముందగుడు వేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. దివ్యాంగుల రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజయం సాధించిన దివ్యాంగులకు బహుమతులు ఎస్పీ ప్రదానం చేశారు.

## మనిషి జీవితం...అత్యుత్తమ మార్గానికి భగవద్గీత దిక్సూచి

**-గీతాజయంతి వేడుకల్లో విద్యానందగిరిస్వామి**



తిరుపతి, డిసెంబర్ 3ప్రభాతవార్త: ప్రతి మనిషి తన జీవితాన్ని అత్యుత్తమ మార్గంలో నడవడానికి భగవద్గీత దిక్సూచిలా పనిచేస్తుందని విద్యానందగిరి స్వామి అనుగ్రహ భాషణం చేశారు. మళయాళ సద్గురుసేవా సమాజం 55వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అందులో మూడు రోజులు పాటు గీతాజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పలువురు ఆశ్రమాల స్వామీజీలు తరలివచ్చారు. మలయాళ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రాయలసీమరంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, అవధాని ఆముదాల మురళి, హేమంత్‌కుమార్ స్వామి, పుత్తూరుస్వామి, ఆనందస్వామి, సర్వాత్మనాంద స్వామి తదితరులు గీతా పారాయణం, లలిత సహస్రపారాయణం, విష్ణుసహస్ర పారాయణం ఆలపించారు. మలయాళస్వామి ఆశ్రమంలో పూజలు జరిపించారు.

## కంగుంది కొండపై ఘనంగా కార్తీక దీపోత్సవం

**- గిరి ప్రదక్షిణ.. ఆలయాల్లో ప్రత్యేక పూజలు**



కుప ్పం,డిసెంబర్ 3 ప్రభాతవార్త : మండలంలోని కంగుంది కొండపై వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. కొండ చుట్టూ భక్తులు తమిళనాడులోని తిరువణ్ణామలై తరహాలో గిరి ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నుంచే గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ ్నంభక్తులకు అన ్నదానం జరిపారు. గ్రామాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించడంతో పాటు రాత్రి కొండపై కార్తీక దీపం వెలిగించడంతో గ్రామంలో ఆధ్యాత్మికత ఉట్టిపడింది. కార్యక్రమాల్లో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, గంగమ్మగుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, కౌన్సిలర్ సోమశేఖర్, నేతలు దివాకర్, లోకేష్, మునాఫ్, తిరుపతి, షరీఫ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## షణ్ముఖ ఆలయంలో చొక్కాణి దీపం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలో తమిళ కార్తీక మాసం సందర్భంగా బుధవారం తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయంలో చొక్కాణి దీపాన్ని భక్తులు వెలిగించారు. ఈ ఆలయం ఆలయ మిరాసిదారులు ఎస్ఎంకె బాబు గురుకుల్ కుమారుడు ఎస్ఎంకె పరపురాం గురుకుల్(అచ్చితా గురుకుల్) నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ప్రత్యేకంగా చొక్కాణి దీపాన్ని వెలిగించారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు అచ్చితా స్వామి పాల్గొన్నారు.

## పొంగి పోర్లుతున్న స్వర్ణముఖి: రాకపోకలకు అంతరాయం

ఏర్పేడు, (శ్రీకాళహస్తి రూరల్), డిసెంబర్ 3 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని మోదుగుల పాళెం వద్ద స్వర్ణముఖి నది ఉధృతం ఎక్కువైంది. దాంతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలో ఉదయం నుంచి కుండపోతగా వర్షం కురుస్తుండటంతో మండల రెవెన్యూ అధికారి భార్గవి, ఎంపిడిఓ సౌభాగ్యంలో సమన్వయంతో పలు ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షించారు. అంతేకాక గ్రామాల్లో రైతుల్ని, ప్రజల్ని అప్రమత్తం చేసారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని హెచ్చరించారు. కొత్త వీరాపురం వద్ద స్వర్ణముఖి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మోదుగుల పాళెంతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు స్థంభించాయి. ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసారు. ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా బుధవారం కూడా గుడిమల్లం ఆలయానికి దర్శనాలకు వెళ్ళు భక్తులకు స్వామి దర్శన అవకాశం లభించలేదు.

## చొక్కాని చెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా చొక్కాణి చెట్టుకు(తాటిచెట్టు) పూజలు నిర్వహించారు. ఆలయ డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌ల పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలోప కలశ స్థాపన గావించి నిరంజన్‌గురుకుల్, ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తుండగా పూజలు నిర్వహించారు. ఈ కలశం నీటితో తాటిమాను గుంటకు సంప్రోక్షణ చేసారు. ఓ వైపు కుండపోత వర్షం కురుస్తున్నా లెక్కచేయక తాటిమానును నిలబెట్టారు. దానికి చుట్టూ తాటిమట్టలతో ముస్తాబుచేసి చొక్కాణి నిర్వహించారు.

# గూడూరు డివిజన్

## నేదురుమల్లితో... నల్లపరెడ్డి భేటీ



కోట, డిసెంబర్ 3 ప్రభాతవార్త : వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డిని నెల్లూరులోని నివాసంలో మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపే విషయమై వారిద్దరి మధ్య సుదీర్ఘమైన చర్చ జరిగింది. ఎలాగైనా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపి గూడూరు నియోజకవర్గ ప్రజల మనోభావాలను గౌరవించాలని వారు చర్చించినట్లు తెలిసింది. చిల్లకూరు మండల వైసీపీ కన్వీనర్ మధురెడ్డి, ముల్లు విజయ కుమార్‌రెడ్డి, చిట్టమూరు రాజారెడ్డి, కోట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, వీరి చలపతిరావు, కొండూరు అనిల్‌బాబు, నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి, కలువ బాలశంకర్‌రెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

## చెందోడు సబ్ స్టేషన్ జలయమం



కోట, డిసెంబర్ 3 ప్రభాతవార్త : మండలం చెందోడు విద్యుత్ సబ్ స్టేషన్ మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంకు నీటి ప్రవాహం చేరడంతో మునిగిపోయింది. సబ్ స్టేషన్ లోపాలకి కూడా నీళ్ల రావడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు సరఫరాలేదు. ఈక్రమంలో ఎస్ఇ చంద్రశేఖం రావు బుధవారం సబ్ స్టేషన్‌కు చేరకుని పరిస్దితిని గమనించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. దీంతో ఎస్ఇ. చంద్రశేఖర్‌రావు డిఎల్‌పితో కూడా మాట్లాడారు. ఆయన వెంట ఇఇ నరేంద్రరెడ్డి, ఎడి చిన్నయ్య, వర ప్రసాద్‌రెడ్డిలు ఉన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



కోట, డిసెంబర్ 3 ప్రభాతవార్త : మండలంలో గత మూడురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సుడిగాలి పర్యటన చేశారు. దైవాలదిబ్బ, ఉత్తమనెల్లూరు, ఉచ్చువారిపాలెం, కొక్కుపాడు, కోట తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. కోటలోని మెయిన్ రోడ్డులో కల్వర్టు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందు లను గమనించిన ఎమ్మెల్యే స్పందించారు. శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో పర్యటించి అక్కడ ప్రజలకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, జలీల్ అహ్మద్, మధుయాదవ్, తిరుమలశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 6న డిఆర్‌డబ్ల్యూ కాలేజ్ నందు మెగా జాబ్ మేళా

గూడూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త: ఈ నెల 6వ తేది శనివారం జరిగే డిఆర్‌డబ్ల్యూ కాలేజ్ నందు మెగా జాబ్ మేళాను నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత అందరూ ఉపయోగించుకోవాలని జాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ విడుదల చేసారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం ముందంజలో ఉండాలని రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా ఈ నెల 6వ తేదీన పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కాలేజ్ నందు దాదాపుగా 10 కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు.

## రెడ్ సంస్థ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే



గూడూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త: రెడ్ సంస్థ అద్వర్యంలో గత 15 ఏళ్ళుగా దివ్యాంగులకు చేయూత అందించడం అభినందనీయమని, దివ్యాంగుల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని షాదీమంజిల్ లో అంతర్జాతీయ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రెడ్ సంస్థ అద్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశం క్రీడాపోటీల్లో గెలుపొందిన దివ్యాంగుల క్రీడాకారులకు ఆయన చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిల్లు చెంచురామయ్య, రహీమ్, ఇశ్రాయిల్ కుమార్, రెడ్ సంస్థ ప్రతినిధులు సుధీర్, రాజేష్, శ్రీధర్, రామలింగం, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులను ఆదుకునేందుకు చర్యలు

గూడూరు రూరల్, డిసెంబర్ 3 ప్రభాతవార్త: దిత్వా తుపాను కారణంగా నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకునేందుకు చర్యలు చేపడతామని వీవర్స్ డెవలప్మెంట్ అధికారి వీవర్స్ డెవలప్‌మెంట్ అధికారి ఉమ మహేశ్వర రావు, స్థానిక టీడీపీ నాయకురాలు మట్టం శ్రావణిరెడ్డిలు పేర్కొన్నారు. వీరి వెంట మాజీ చేనేత సొసైటీ అధ్యక్షులు కటికాల శ్రీనివాసులు, రాజనాల, రాయవరపు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఎడతెరిపు లేకుండా వర్షం

చిల్లకూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త: మండలంలో రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా దిత్వా తుఫాన్ కారణంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని నాంచారం పేట, పారిచర్లవారి పాలెం గ్రామ సమీపంలో ఉన్న వంతెన పొంగి ప్రవహించడంతో చిల్లకూరు తహసిల్దార్ కె.శ్రీనివాసులు, ఎస్ఐ సురేష్ బాబు సిబ్బందితో కలసి వాహనాలు రాకపోకలు నిలిపి వేయడం జరిగింది. అదే విధంగా తీర ప్రాంత గ్రామాల్లో పురావస కేంద్రాలు ఏర్పాటు చేసి భోజన వసతి కల్పిస్తున్నారు.

## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం




గూడూరు, డిసెంబర్ 3 ప్రభాతవార్త : కోర్టు ప్రాంగణంలో మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సదరు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి. సులోచన రాణి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ గూడూర్ విచ్చేసి తమ సందేశాన్ని ఇచ్చారు. బల్బును కనిపెట్టిన ఎడిషన్ కూడా దివ్యాంగుడేనని సుధా చంద్రన్ అనే నాట్యకారిణి దివ్యాంగురాలేనన్నారు. న్యాయవాదులు అరవ పార్వతయ్య, ఎస్.కె మహబూబ్ బాషా, లోక్ అదాలత్ సిబ్బంది హైమావతి, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఏర్పేడు జలమయం



ఏర్పేడు, డిసెంబర్ 3 ప్రభాతవార్త : గత వారం రోజులుగా వర్షం పడుతున్నా, బుధవారం సాయంత్రం కుండపోత వర్షంతో ఏర్పేడు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు మండలంలోని చెరువులన్నీ జల కళను సంతరించుకు న్నాయి. కొన్ని చెరువులు ప్రమాదకర పరిస్థితిలో వుండడంతో చెరువుల వద్ద ప్రజలు కాపుకాస్తున్నారు. గతంలో ఏర్పేడు చెరువు కలుజును గాలి కృష్ణవేణి బాగుచేయించడంతో ఇప్పు డు ఎలాంటి ఇబ్బంది లేకుండా వుంది. వరద తాకిడి ప్రాంతాల్లో సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, వీఆర్వోలు వాసు, మునస్వామి, సెక్రటరీ అయ్యప్పరెడ్డిలు కలుజును పరిశీలించారు.

## దేవరకొండలో కార్తీక దీపం



బంగారుపాళ్యం, డిసెంబర్ 3 ప్రభాతవార్త: శ్రీ మొగిలీశ్వరాలయానికి అనుబంధంగా వున్న దేవరకొండ నందు బుధవారం సాయంత్రం కార్తీక దీపంను వెలిగించారు. ప్రతి ఏడాది కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని దేవరకొండపై కార్తీక దీప వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. దేవరకొండపై వెలసిన జలకంఠేశ్వర స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపైన ఏర్పాటు చేసిన దీపం స్తంభంపై కార్తీక దీపంను వెలిగించి భక్తులకు దర్శనం గావించారు. పరిసర గ్రామస్తులు, పలమనేరు, తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో భక్తులు దేవరకొండకు విచ్చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, భజనలు చేపట్టారు. మొగిలి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబి విజయకుమార్, ఇఓ మునిరాజు, ఆలయ సిబ్బంది తగు ఏర్పాటు చేశారు.

## మున్సిపల్ కార్మికుల ధర్నా

వెంకటగిరి, డిసెంబర్ 3 ప్రభాతవార్త: మున్సిపల్ కార్మికులకు పాత బకాయిలు ఇవ్వాలని కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. కమిషనర్ వెంకట్రామిరెడ్డికి పాత బకాయిలు ఇవ్వాలని వినసపత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరు జాన్ మాట్లాడుతూ 2016 జీవో నెంబర్ 151 ప్రకారం కార్మికులకు, ఎరియర్స్ వేతనబకాయలు ఇవ్వాలని అన్నారు. నాయకులు, అశోక్, కందప్ప, మునిరాజా, సురేష్, సుబ్బయ్య, రవి, రాజా, కుమార్ ప్రసాద్, ప్రశాంత్, శ్రీనివాసులు, నరసింహులు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.